పోలీసు అమరవీరుల త్యాగాలు

చిరస్మరణీయం

బాపట్ల, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో అశువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని ఎస్పీ తుషార్ డూడీ అన్నారు. పట్టణ పోలీస్‌స్టేషన్ వద్ద పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. పోలీసు వాయిద్యాలతో స్మృతి పెరేడ్ నిర్వహించారు. పోలీసు అమరవీరుల స్మారక స్తూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళి అర్పించారు. పోలీసు సిబ్బంది ప్రదర్శనను ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మతో కలిసి ఎస్పీ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 1959 అక్టోబరు 21న భారత్-చైనా సరిహద్దులోని అక్సాయ్‌చిన్ ప్రాంతంలో చైనా బలగాలు దేశ భూభాగాన్ని ఆక్రమించటానికి ప్రయత్నిస్తుండగా సీఆర్పీఎఫ్ జవానులు వీరోచితంగా పోరాడి పది మంది ఆత్మబలిదానం చేసిన సందర్భంగా వారి పోరాట పటిమను గుర్తు చేసుకుంటూ ఏటా అక్టోబరు 21న అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాత్రి పగలు, ఎండ, వాన తేడా లేకుండా 24 గంటలు పని చేసే ఉద్యోగమే పోలీసు ఉద్యోగమన్నారు. ప్రజా స్వామ్యాన్ని కాపాడటంలో, నేరాలు నియంత్రించటంలో, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుశాఖ కీలకపాత్ర పోషిస్తోందన్నారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ ప్రజల ప్రాణాలు కాపాడటంలో పోలీసులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పనిచేస్తున్నారని ప్రశంసించారు. పోలీసుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పోలీసులు అంకితభావంతో పని చేస్తూ సమాజానికి రక్షకులుగా ఎనలేని సేవలు అందిస్తున్నారన్నారు. పోలీసు అమరవీరుల కుటుంబాలకు అండగా నిలుస్తామని పేర్కొన్నారు. అదనపు ఎస్పీ విఠలేశ్వర్, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.



స్మారక స్తూపం వద్ద వందనం చేస్తున్న ఎమ్మెల్యే వేగేశన, పోలీసు అధికారులు



అంబేడ్కర్ విగ్రహ కూడలి వద్ద మానవ హారంగా ఏర్పడ్డ విద్యార్థులు, సిబ్బంది

మహిళలకు ఉచిత శిక్షణ

గుంటూరు: గుంటూరు యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు చెందిన గ్రామీణ మహిళలకు నవంబరు 5 నుంచి బ్యూటీపార్లర్, జర్దోసి, మగ్గం వర్క్ కోర్సుల్లో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు సంస్థ సంచాలకుడు జి.బి.కుమార్ సోమవారం తెలిపారు. ఆసక్తి గల 19-45 మధ్య వయసు మహిళలు.. తెల్ల రేషన్, ఆధార్ కార్డులతో పాటు నాలుగు పాస్‌ఫోర్టు సైజు ఫొటోలు గుంటూరు కొత్తపేటలోని సంస్థ కార్యాలయంలో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. కోర్సులకు హాజరయ్యే మహిళలకు ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 0863-2336912, 97006 87696, 81253 97953 నంబర్లలో సంప్రదించాలన్నారు.

బహుళ పంటలు.. లాభానికి మార్గాలు
మినుము పంట ఇలా కాపాడుకుందాం 6లో
రైతేరాజు

కొలువులపై ఆశలు

సర్టిఫికేషన్ కోర్సులు చేసిన వారికి కంపెనీల ప్రాధాన్యం

ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రారంభమైన నియామకాలు

న్యూస్‌టుడే, బాపట్ల

ఇంజినీరింగ్ చివరి ఏడాది విద్యార్థులకు కొలువులపై ఆశలు కల్పిస్తూ ప్రముఖ కంపెనీలు ఉద్యోగ నియామక ప్రక్రియకు పచ్చజెండా ఊపాయి. ఇంజినీరింగ్ కళాశాలల్లో ఆన్‌లైన్ రాత, మౌఖిక పరీక్షలు నిర్వహించి ప్రతిభ ఉన్నవారిని ఎంపిక చేస్తున్నాయి. బీటెక్ కోర్సుతో పాటు సర్టిఫికేషన్ కోర్సులు చేసిన వారికి ఉద్యోగాలు ఇవ్వటానికి కంపెనీల ప్రతినిధులు ఆసక్తి చూపుతున్నారు. ఉపాధి అవకాశాల పరంగా ఈ ఏడాది సానుకూల పరిస్థితులు కనిపిస్తున్నాయి.

❖ ఇంజినీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులు ఉద్యోగ అవకాశాల పరంగా నిరుడు గడ్డు పరిస్థితులు ఎదుర్కొన్నారు. ప్రముఖ కంపెనీలు ఉద్యోగ నియామకాల్లో భారీగా కోతలు విధించాయి. కొత్త ప్రాజెక్టులు తక్కువగా ఉండటం, ఆదాయ వృద్ధి మందగించటం తదితర కారణాలతో గతంలో ఉద్యోగాలకు ఎంపిక చేసిన వారిని కూడా విధుల్లోకి తీసుకోలేదు. వేతనాల్లో సైతం కోత పడింది.

❖ అమెరికా, కెనడాల్లో ప్రతికూల పరిస్థితులు, ఉద్యోగాలు లభించకపోవటంతో ఎంఎస్ చేయటానికి వెళ్లే విద్యార్థుల సంఖ్య తగ్గింది. విద్యార్థులు కొంతకాలం ఉద్యోగం చేసి పరిస్థితులు మెరుగైన తర్వాత అమెరికా వెళ్లి ఉన్నత చదువులు చదవాలని భావిస్తున్నారు. ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్న విద్యార్థుల సంఖ్య పెరిగింది. సాఫ్ట్‌వేర్ కంపెనీలు గడ్డు పరిస్థితులను అధిగమించి కొత్త ప్రాజెక్టులు వస్తుండటంతో నియామకాలు పెంచాలని నిర్ణయించాయి. కొన్ని ఇప్పటికే ఇంజినీరింగ్ కళాశాలలకు వచ్చి ఆన్‌లైన్ రాత పరీక్ష, మౌఖిక పరీక్ష నిర్వహించి ప్రతిభావంతులను ఉద్యోగాలకు ఎంపిక చేస్తున్నాయి. పెద్ద కంపెనీలు సైతం నియామక ప్రక్రియ ప్రారంభించాయి.

❖ కంపెనీల ప్రతినిధులు ఇప్పటికే తమ ప్రాధాన్యాలను వివరిస్తూ కళాశాలల శిక్షణ, ఉపాధి కల్పన అధికారులకు ఈ-మెయిల్ పంపించారు జావా, సన్‌మైక్రోసిస్టమ్స్, ఏడబ్ల్యూఎస్, పైథాన్, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ సర్టిఫికేషన్ కోర్సులు చేయాలని అడుగుతున్నారు. ఇంజినీరింగ్‌లో పారిశ్రామిక శిక్షణ (ఇంటర్న్‌షిప్) 12 వారాలు పూర్తి చేసి ప్రతిభ చూపిన వారికి ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి ప్రముఖ కంపెనీలు ఇంటర్న్‌షిప్ చేస్తున్న వారికి నెలకు రూ.40 వేల స్టైఫండ్ ఇస్తున్నాయి. వీరిని తొలుత కొలువులకు ఎంపిక చేస్తున్నారు. మైక్రోసాఫ్ట్, గూగుల్, ఐబీఎం, ఎస్ఏటీ వంటి పెద్ద కంపెనీలు ఏడాదికి రూ.20 లక్షల నుంచి రూ.45 లక్షల వరకు వేతనాలు చెల్లిస్తున్నాయి. ఈ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపిక కావటానికి కళాశాలల్లో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఇటీవల ఇంజినీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులకు నియామకాల్లో కంపెనీలు ప్రాధాన్యత ఇస్తున్నాయి.

జిల్లాలో ఇంజినీరింగ్ కళాశాలలు:	7
నాలుగేళ్ల బీటెక్ కోర్సు పూర్తి చేసి బయటకు వచ్చే విద్యార్థులు:	1620
గతేడాది ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు:	580



సర్టిఫికేట్ కోర్సులు నేర్చుకుంటున్న విద్యార్థులు

ఎక్కువ మందికి ఉద్యోగావకాశాలు

ఉపాధి పరంగా గతంలో కన్నా మెరుగైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. కంపెనీలు తమకు ఎలాంటి నైపుణ్యాలు కావాలో ముందుగానే తెలియజేస్తున్నాయి. ఎక్కువ సంఖ్యలో నియామకాలు చేపట్టనున్నాయి. ఇప్పటికే సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఉద్యోగ నియామకాల ప్రక్రియ ప్రారంభించాయి. విద్యార్థులను ప్రత్యేక సర్టిఫికేషన్ కోర్సులు పూర్తి చేసేలా ప్రోత్సహిస్తున్నాం. ఎక్కువ మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు దక్కుతాయి.

- షేక్ నజీర్, ప్రిన్సిపల్, బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల

తెదేపా- వైకాపా వర్గాల ఘర్షణ

ముగ్గురికి గాయాలు

బాపట్ల, బాపట్ల పట్టణం, కర్లపాలెం, న్యూస్‌టుడే: ప్రశాంతంగా ఉండే గ్రామంలో చిన్నపాటి వివాదం ఘర్షణకు దారితీసింది.. సోమవారం తెల్లవారుజామున తెదేపా, వైకాపా వర్గాలు పరస్పరం ఘర్షణకు దిగటంతో ఇరు పార్టీలకు చెందిన ముగ్గురికి గాయాలయ్యాయి. దీంతో గ్రామంలో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సేకరించిన మేరకు వివరాలు.. కర్లపాలెం మండలం పెదగొల్లపాలెంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన వివాహ వేడుకలకు తెదేపా వర్గానికి చెందిన వారు హాజరై ఆరుబయట కూర్చున్నారు. ఈ నేపథ్యంలో అదే గ్రామంలో వైకాపాకు చెందిన నర్రా నాగేంద్రబాబు, సునీల్ ద్విచక్రవాహనంపై తెదేపా వర్గీయుల వద్దకు వచ్చి పెద్ద శబ్దాలు చేస్తూ వాహనంపై చక్కర్లు కొట్టి రెచ్చగొట్టారు. వద్దని వారించినా వారు పట్టించుకోలేదు. దీంతో వైకాపా కార్యకర్తలకు తెదేపాకు చెందిన పమిడి గోపి దేహశుద్ధి చేసి కర్లపాలెం పోలీస్‌స్టేషన్లో పోలీసులకు అప్పగించేందుకు వెళ్తుండగా వైకాపా వర్గీయులు 50మంది వెంబడించి పమిడి శ్రీనివాసరావును చితకబాదటంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం బాపట్ల ప్రాంతీయ ఆసుపత్రిలో చేర్పించారు. ఇరువర్గాలకు చెందిన నిందితులపై వేర్వేరుగా కర్లపాలెం కేసులు నమోదు చేశారు.

పాత కక్షలు కారణం?..


గ్రామంలో ఒకే సామాజిక వర్గంలో ఇరువర్గాల మధ్య పాతకక్షలు ఉన్నాయి. గ్రామంలో తెదేపా-వైకాపా వర్గీయులకు కృష్ణుడి మందిర నిర్మాణం విషయమై వివాదం ఉంది. గ్రామంలో ఉర్లమ్మ తల్లి శిల వద్ద అమ్మవార్లకు నైవేద్యాలు పెట్టే ప్రాంతంలో దేవాలయ నిర్మాణానికి వైకాపా వర్గీయులు శ్రీకారం చుట్టగా తెదేపా వర్గీయులు అభ్యంతరం తెలిపారు. ఆలయ నిర్మాణానికి ప్రజల వద్ద సేకరించిన నిధుల్లో అవకతవకలపై తెదేపా వర్గీయులు ప్రశ్నిస్తూ వచ్చారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్యకర్తలను నేతలు మేరుగునాగార్జున, కోన రఘుపతి పరామర్శించారు.



గాయపడ్డ శ్రీనివాసరావు

20 గేట్ల నుంచి నీటి విడుదల

నాగార్జునసాగర్ జలాశయం 20 క్రస్టు గేట్లు అయిదు అడుగులు ఎత్తి 1,59,900 క్యూసెక్కుల నీటిని దిగువ కృష్ణాకు విడుదల చేస్తున్నారు. సాగర్ కుడి కాలువకు 9047, ఎడమ కాలువకు 6173, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుకు 1800, లోలెవల్ కెనాల్‌కు 400, సాగర్ ప్రధాన జలవిద్యుత్తు కేంద్రానికి 25,100 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం సాగర్ జలాశయ నీటిమట్టం 589.00 అడుగుల వద్ద కొనసాగుతోంది. **- న్యూస్‌టుడే, విజయపురిసౌత్**



రైల్వే అండర్‌పాస్‌లో వరద నీరు.. రాకపోకలకు వెతలు

ఇటీవల కురిసిన వర్షాలకు ఎగువ నుంచి వరద నీరు చినగంజాం, ఉప్పుగుండూరు రైల్వేస్టేషన్ల మధ్య ఉన్న రైల్వే అండర్‌పాస్ కిందకు చేరింది. సుమారు నాలుగు అడుగుల మేర నీటి చేరికతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వేరే మార్గం లేక అవస్థలు పడుతూనే అదే నీటిలో ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకది. ఈ క్రమంలో వాహనాల్లోకి నీరు చేరి మొరాయిస్తున్నాయని వాహనదారులు చెబుతున్నారు. **- న్యూస్‌టుడే, చినగంజాం**



అదుపుతప్పి లారీ బోల్తా

అమృతలూరు మండలంలో యలవర్రు గ్రామంలో సోమవారం లారీ బోల్తా పడింది. కంకర లోడుతో ఉన్న లారీని వెనక్కు మరల్చే క్రమంలో వంతెన పక్కకు వెళ్లడంతో అదుపు తప్పి కాల్వలోకి పడిపోయింది. ఈ సంఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. **- న్యూస్‌టుడే, అమృతలూరు**



మాటేసి దారి దోపిడీలు

☛ నగలు వ్యాపారి సొమ్ము అపహరణ కేసు ఛేదన
☛ నిందితుడికి గతంలో ట్రాన్స్‌పోర్టులో పనిచేసిన అనుభవం
☛ మూడు రోజులు లారీ వెంటే ప్రయాణం

ఈనాడు, బాపట్ల

కమర్షియల్ టాక్స్ అధికారుల మాదిరి జాతీయ రహదారి పక్కన కారుతో మాటువేసి దారిదోపిడీలకు పాల్పడుతున్న ముఠాను బాపట్ల జిల్లా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మేదరమెట్ల స్టేషన్ పరిధిలో ఇటీవల సరకు రవాణా చేసే వాహనంలో ప్రయాణిస్తున్న బంగారు నగల వ్యాపారి స్వరూప్‌ను కొట్టి అతని నుంచి రూ.39.50 లక్షలు అపహరించుకుపోయిన నలుగురు సభ్యుల ముఠాను 48 గంటల్లోపే పట్టుకోవటంతో కేసు చిక్కుముడి వీడింది. కేసును మేదరమెట్ల, అద్దంకి రూరల్ పోలీసులు సంయుక్తంగా ఛేదించారు. వ్యాపారిని బెదిరించి పట్టుకుపోయిన నగదు మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. గూడ్స్ ట్రాన్సుపోర్టులో గతంలో పనిచేసిన ఓ ఉద్యోగి ఈ కేసులో సూత్రధారిగా గుర్తించారు. అతనికి సరకు లారీలో ప్రయాణించే వ్యాపారులపై పక్కా సమాచారం ఉందని ఆయనే ఈ దోపిడీకి వ్యూహం రచించారని పోలీసుల విచారణలో తేలింది. నిందితుల ముఠాను మంగళ, బుధవారంలో అరెస్టు చూపే అవకాశం ఉంది.

విజయవాడ నుంచి అనుసరిస్తూ..

గుంటూరుకు చెందిన నగల వ్యాపారి తరచూ చెన్నై వెళతారు. అక్కడ బంగారు నగలు కొనుగోలు చేసి గుంటూరుకు అదే ట్రాన్సుపోర్టులో వస్తారు. యథావిధిగానే వ్యాపారి స్వరూప్ బంగారు నగలు కొనుగోలుకు ఈనెల 18న రాత్రి గుంటూరులో లారీ ఎక్కారు. ఆ సరకు లారీ విజయవాడ నుంచి వస్తోంది. అక్కడి నుంచే ఆ ట్రాన్సుపోర్టులో పనిచేసిన మాజీ ఉద్యోగి మరో ఇద్దరితో కలిసి కారులో లారీని అనుసరిస్తున్నారు. గుంటూరులో ఈ వ్యాపారి ఎక్కగానే కొరిశపాడు ఫ్లైఓవర్ సమీపంలో మాటువేసిన మరో ఇద్దరు సభ్యులకు ముందస్తు సమాచారమిచ్చి వారిని లారీ ఫ్లైఓవర్ వద్దకు చేరుకోగానే రహదారికి అడ్డంగా నిలబడి తనిఖీ అధికారుల మాదిరి నటించేలా చేస్తారు. లారీ ఆగగానే వెనక నుంచి అనుసరిస్తున్న కారును ఒక్కసారిగా లారీ ముందుకు తెచ్చి అడ్డు పెడతారు. లారీ డ్రైవర్‌ను, క్యాబిన్‌లో కూర్చొన్న వ్యాపారిని కిందకు దిగాలని తాము కమర్షియల్ టాక్సు అధికారులమని బిల్లులు చూపాలని కోరారు. కిందకు దిగగానే వ్యాపారిని పథకం ప్రకారం పి.గుడిపాడు వైపు కారులో ఎక్కించుకుని తీసుకెళ్లి అక్కడ బెదిరించి బ్యాగ్‌తో సహా నగదు తీసుకుని విషయం ఎవరికైనా చెబితే చంపేస్తామని హెచ్చరించి తిరిగి లారీ వద్దకు తెచ్చి వదిలేశారు. అప్పటి దాకా లారీని అక్కడే నిలిపి డ్రైవర్‌కు ఇద్దరు వ్యక్తులు కాపలా ఉంటారు. వ్యాపారిని తీసుకురాగానే అంతా కలిసి కారులో వెళ్లిపోతారు.

స్థానికుల సమాచారం.. పట్టించిన కారు నంబరు

లారీని ఆపి కారులో వ్యాపారిని ఎక్కించుకుని వెళుతున్న ఉదంతాన్ని స్థానికుడు ఒకరు చూశారు. వ్యాపారి ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా ప్రదేశానికి చేరుకుని అక్కడి వారిని విచారించి ఆ ప్రాంతంలో సీసీ ఫుటేజీలు తీసి కారును గుర్తించారు. కారుపై నంబరు ఆధారంగా ఈ మొత్తం అపహరణకు సూత్రధారులు, పాత్రధారులు దొరికిపోయారు. కారు నంబరు లభించగానే దాని నిర్వాహకుడి ఫోన్ టవర్ లొకేషన్ తీసుకుని వెంటనే పోలీసులు వారిని అదుపులోకి తీసుకోవటంతో కేసు చిక్కుముడి వీడింది.

లారీ వెంట మూడు రోజులు రెక్కీ

ఈ ముఠా మూడు రోజుల పాటు లారీని అనుసరించింది. రెండురోజులు విజయవాడ నుంచి బొల్లాపల్లి టోల్‌ప్లాజా వరకు వచ్చే వరకు ఎవరూ ఎక్కలేదని తెలుసుకుని నిరాశతో వెళ్లిపోయారు. మూడో రోజు విజయవాడ నుంచి లారీని అనుసరించారు. ఆ రోజు గుంటూరులో స్వరూప్ అనే నగలు వ్యాపారి ఎక్కటం ఆయన గతంలో కూడా అదే వాహనంలో పలుమార్లు చెన్నైకు వెళ్లారని కచ్చితంగా ఆయన వద్ద డబ్బులు ఉంటాయని భావించి పక్కా ప్రణాళికతో వ్యవహరించారు. చివరకు పోలీసులకు చిక్కారు. నిందితులు మేదరమెట్ల, కొరిశపాడు, ఒంగోలుకు చెందిన వారిగా తెలిసింది.

సాగునీటి సంఘాల ఎన్నికలకు ప్రకటన

నవంబరు 29 నాటికి ప్రక్రియ పూర్తి

జిల్లాల వారీగా కమిటీల ఎన్నిక

ఈనాడు, అమరావతి

నాగార్జునసాగర్ ప్రాజెక్టు, కృష్ణా పశ్చిమ డెల్టా కింద రైతుల భాగస్వామ్యంతో రైతుప్రతినిధులను ఎన్నుకోవడానికి సాగునీటి సంఘాలకు కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ప్రకటన ఇచ్చింది. సోమవారం జిల్లాల వారీగా ప్రకటనలు విడుదల కావడంతో ఓటర్ల జాబితా, ఎన్నికలు, ఎంపిక ప్రక్రియ మొత్తం నవంబరు 29నాటికి పూర్తి చేసేలా షెడ్యూల్ ప్రకటించింది. మేజర్, మీడియం, మైనర్ ప్రాజెక్టుల కింద కాలువల ఆయకట్టు రైతులు ఓటర్లుగా ఉండటంతో సమర్థులైన రైతులను కమిటీ ఛైర్మన్లుగా ఎన్నుకునే వెసులుబాటు ఉంది. గత ఐదేళ్ల వైకాపా పాలనలో సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా వ్యవస్థను నిర్వీర్యం చేశారు. కాలువల నిర్వహణ, కనీస మరమ్మతుకు కూడా నిధులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారు. కూటమి ప్రభుత్వం ప్రస్తుతం సాగునీటి సంఘాలకు ఎన్నికల ప్రకటన ఇచ్చి కమిటీల ఎంపిక ప్రక్రియకు మార్గం సుగమం చేసింది.

రైతు ప్రతినిధులతో కమిటీలు

కాలువల కింద 6 నుంచి 12 మంది ప్రాదేశిక నియోజకవర్గాలు(టీసీ)గా గుర్తిస్తారు. ఇందులో భూమి కలిగిన ప్రతి ఆయకట్టుదారుడు ఓటరుగా ఉంటారు. అర్హులైన వారు రెవెన్యూ, జలవనరులశాఖ అధికారుల వద్ద ఓటరుగా నమోదు చేసుకోవాలి. ప్రాదేశిక నియోజకవర్గంలోని సభ్యులందరూ నీటివినియోగదారుల సంఘాన్ని (డబ్ల్యూఏ) ఎన్నుకుంటారు. డబ్ల్యూఏ ఛైర్మన్‌గా ఎన్నికైన వారు డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఛైర్మన్లను ఎన్నుకుంటారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్‌లు ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్‌ను ఎన్నుకుంటారు. సాగర్ కాలువల కింద లింగంగుంట్ల, ఒంగోలు సర్కిళ్లు ఉన్నాయి. రెండు సర్కిళ్లకు కలిపి ఒకే ప్రాజెక్టు కమిటీ ఉంటుంది. పల్నాడు జిల్లాలోని లింగంగుంట్ల సర్కిల్ పరిధిలోని వారే ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్‌గా ఎన్నికవుతారు. ఒంగోలు సర్కిల్ పరిధిలోని ఒంగోలు జిల్లావారు ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడిగా ఎన్నికవుతారు. అదేవిధంగా కృష్ణాపశ్చిమ డెల్టా పరిధిలో గుంటూరు, బాపట్ల జిల్లాల్లో ఆయకట్టు ఉంది. రెండు జిల్లాల్లో డబ్ల్యూఏ, డీసీలను ఎన్నుకుంటారు. బాపట్ల జిల్లాలో ఆయకట్టు ఎక్కువగా ఉన్నందున ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ పదవి ఆ జిల్లా వాసులకు దక్కనుంది. ఉపాధ్యక్ష పదవి గుంటూరు జిల్లావాసులకు వస్తుంది.

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో చిన్ననీటిపారుదల విభాగంలో 60 డబ్ల్యూయూఏలు ఉన్నాయి. ఇవి మైనర్ ఇరిగేషన్ కింద ఉన్నందున డబ్ల్యూఏలు మాత్రమే ఉంటాయి. చిన్ననీటిపారుదల శాఖ పరిధిలో డీసీ, పీసీలు ఉండవు.



బాపట్ల జిల్లాలో..

బాపట్ల జిల్లాలో కృష్ణా పశ్చిమ డెల్టా, సాగర్ కాలువల కింద కలిపి మొత్తం 154 డబ్ల్యూఏలు, మైనర్ ఇరిగేషన్ కింద 16డబ్ల్యూఏలు ఉన్నాయి. 24 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయి. ఎన్నికలకు సంబంధించి సోమవారం కలెక్టర్ ప్రకటన విడుదల చేయడంతో ప్రక్రియ ప్రారంభమైంది. కృష్ణా పశ్చిమ డెల్టాలో బాపట్ల జిల్లా కింద ఆయకట్టు ఎక్కువగా ఉన్నందున ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ పదవి బాపట్ల జిల్లా వాసులకే దక్కనుంది. దీంతో ఇక్కడ పలువురు ఆసక్తి చూపుతున్నారు.

గుంటూరు జిల్లాలో 106డబ్ల్యూఏలు

గుంటూరు జిల్లాలో కృష్ణా పశ్చిమడెల్టా కాలువల కింద 50 డబ్ల్యూఏలు, 6 డీసీలు, సాగర్ కాలువల కింద 37 డబ్ల్యూఏలు, 6 డీసీలు, గుంటూరు చానల్ కింద 14 డబ్ల్యూఏలు, 2 డీసీలు ఉన్నాయి. వీటితో పాటు మైనర్ ఇరిగేషన్ కింద 5 డబ్ల్యూఏలు ఉన్నాయి. వీటన్నిటికి సోమవారం ఎన్నికల ప్రకటన విడుదల చేశారు. ఇప్పటినుంచి దశలవారీగా ఓటర్ల జాబితా, అభ్యంతరాల స్వీకరణ, కమిటీల సమావేశాలు, కమిటీల ఎన్నికల చివరికి ప్రాజెక్టు కమిటీ ఎన్నికతో నవంబరు 29 నాటికి ప్రక్రియ పూర్తి చేస్తారు.

ఫిర్యాదులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు

బాపట్ల, బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమని ఎస్పీ తుషార్ డూడీ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం నిర్వహించారు. అర్జీదారుల సమస్యలను ఎస్పీ స్వయంగా విని సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసి చట్ట పరిధిలో విచారించి నిర్దిష్ట గడువు లోగా పరిష్కరించాలని ఆదేశించారు. మహిళల ఫిర్యాదులపై పోలీసు అధికారులు వేగంగా స్పందించాలన్నారు. పలు సమస్యలపై 39 మంది అర్జీలు అందజేశారు. డీఎస్పీ జగదీష్‌నాయక్, సీఐ శ్రీనివాసులు పాల్గొన్నారు. ఎస్పీ దృష్టికి వచ్చిన సమస్యల్లో కొన్ని..

☛. చీరాల మండలం వైకుంఠపురానికి చెందిన కె.సాయిఅనూష తన బంధువుల ద్వారా పరిచయమైన కోసిరెడ్డి గణేష్‌రెడ్డి అనే వ్యక్తి దేవాదాయశాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి 2022లో రూ.లక్ష నగదు తీసుకున్నాడని, నేటికీ సమాధానం చెప్పడం లేదని పైగా బెదిరిస్తుండటంతో కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయని ఫిర్యాదులో పేర్కొంది. వంచనకు పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

☛ పాత చీరాలకు చెందిన పిట్టు దేవరరెడ్డి, కోటేశ్వరమ్మ దంపతులు తమ 29 సెంట్ల స్థలంలోకి వెళ్లకుండా గ్రామానికి చెందిన ఎన్.జాలిరెడ్డి, వెంకటేశ్వర్లు, శివారెడ్డి అడ్డుపడుతున్నారని, దుర్భాషలాడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలోనూ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

☛ హోంగార్డు ఉద్యోగం ఇప్పిస్తానని రెండేళ్ల క్రితం తన వద్ద రూ.4లక్షల నగదును రాజమండ్రికి చెందిన హరికృష్ణారెడ్డి, సత్యనారాయణ, జయదుర్గ తీసుకున్నారని, నగదు తిరిగివ్వమని అడుగుతుంటే బెదిరిస్తున్నారని చీరాల కొత్తపాలెంనకు చెందిన కావూరి వీరారెడ్డి ఫిర్యాదు చేశారు.

☛ ఓడరేవు ప్రాంతంలో రోశయ్యకాలనీకి చెందిన ఓ మహిళ ఆమె బంధువులైన ఇద్దరు వ్యక్తులు తనను లైంగికంగా వేధించడంతో పారిపోయి వచ్చానని, వారి నుంచి తనకు ఆపద ఉందంటూ పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేసింది.

☛ నగదు తిరిగి చెల్లించే సక్రమంలో జాప్యం జరిగిందనే కారణంగా తమపై అన్యాయంగా కేసు నమోదు చేశారని చీరాల మండలం బెస్తపాలెంనకు చెందిన పఠాన్ మహబూబ్‌బాషా, గౌసియా బేగం దంపతులు పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న యూనీస్ వద్ద కుటుంబ అవసరాలకు నగదు తీసుకున్నామని, తిరిగి కట్టేందుకు ఆలస్యం కావడంతో ఈపూరుపాలెం పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఆమె భర్త యెహెజ్కేలు తమపై అక్రమంగా కేసు నమోదు చేశారని, విచారించి న్యాయం చేయాలని కోరారు.



మహిళల సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ తుషార్ డూడీ

పులి మళ్లీ వచ్చింది..!

వెల్దుర్తి మండల పరిధిలోని గొట్లిపాళ్ల బీట్‌లో పులి సంచరిస్తున్నట్లు విజయపురి సౌత్ రేంజర్ నరసింహారావు తెలిపారు. అడవి జంతువుల సంచారం తెలుసుకునేందుకు ఏర్పాటు చేసిన కెమెరాల్లో నాలుగురోజుల కిందట పులి సంచరించినట్లు నమోదైంది. ఇప్పటికే పలుమార్లు పులి సంచారం కెమెరాల్లో రికార్డు అయింది. అటు వైపు ఎవరూ వెళ్లొద్దని రేంజర్ పేర్కొన్నారు. **- న్యూస్‌టుడే, వెల్దుర్తి**



ప్రార్థన మందిరాల సమీపంలో మద్యం దుకాణాలు వద్దు

బాపట్ల, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రార్థన మందిరాలకు సమీపంలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేయనివ్వరాదని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జేసీ ప్రఖర్‌జైన్‌కు భాజపా ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరాజు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రార్థన మందిరాలకు వంద మీటర్ల దూరం వరకు మద్యం దుకాణాలు ఏర్పాటు చేయటానికి అనుమతించరాదన్నారు.

☛ చీరాలలో పురపాలక ఉద్యోగులు, కార్మికుల కాలనీలో 20 సెంట్ల స్థలాన్ని మురళి అనే వ్యక్తి ఆక్రమించుకున్నారని కాలనీ సంఘం అధ్యక్షుడు కోటేశ్వరరావు, నాయకుడు కొండయ్య జేసీకి ఫిర్యాదు చేశారు. ఆక్రమణను తొలగించి తిరిగి స్థలం కాలనీకి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.


జేసీ ప్రఖర్‌జైన్‌కు వినతిపత్రం ఇస్తున్న భాజపా ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరాజు

వర్షాలకు నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి

ఇటీవల భారీ వర్షాలకు చినగంజాం మండలం పెదగంజాంలో వరి, వేరుసెనగ, ఇతర పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని రైతులు, కౌలురైతుల సంఘం ప్రతినిధులు బసవపున్నయ్య, శ్రీకాంత్, ఆంజనేయులు, వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతూ జేసీ ప్రఖర్‌జైన్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ రైతులు ఎకరాకు రూ.వేలల్లో నష్టపోయారని తెలిపారు. భారీ వర్షాలకు పంటలు ముంపు బారినపడి పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయని వాపోయారు. రైతుల వెంట సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ మజుందార్ ఉన్నారు.

ఇళ్ల మధ్య ఏర్పాటుపై అభ్యంతరం

బాపట్ల పట్టణం, చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే: చీరాల మండలం ఈపూరుపాలెం పాత సినిమా హాలు సమీపంలో జనావాసాల మధ్య ఏర్పాటైన మద్యం దుకాణంతో అనేక సమస్యలు తలెత్తుతాయని ముస్లిం మహిళలు, నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ముందుగా మద్యం దుకాణం వద్ద నిరసన పాటించి అనంతరం వాహనాలపై చీరాల చేరుకున్నారు. ర్యాలీగా బయల్దేరి చీరాల రెవెన్యూ కార్యాలయంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ గోపీకృష్ణకు వినతిపత్రం అందించారు. బాపట్ల వెళ్లి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జేసీ ప్రఖర్‌జైన్‌కు వినతిపత్రం అందించారు. సంఘ నేత పఠాన్‌గౌస్‌ఖాన్ మాట్లాడుతూ ఈపూరుపాలెంలో రెండు మద్యం దుకాణాలు మంజూరయ్యాయని, వాటిలో ఒకదాన్ని మసీదు ప్రాంతంతో పాటు ఇళ్ల మధ్య ఏర్పాటు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై చీరాల ఎక్సైజ్ సీఐకు ఫిర్యాదు చేశామన్నారు. మత పెద్దలు హార్, మస్తాన్, నూర్ మహమ్మద్, జిలాని, కరీముల్లా, సుభాని, సుమారు 100మందికి పైగా ముస్లిం మహిళలు పాల్గొన్నారు.


చీరాల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న మహిళలు, ముస్లిం నాయకులు

వక్తృత్వ పోటీలో సూరేపల్లి విద్యార్థిని ప్రతిభ

భట్టిప్రోలు, న్యూస్‌టుడే: బాపట్ల మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 'సేవ్ ది గర్ల్ చైల్డ్' అంశంపై జిల్లా స్థాయిలో జరిగిన వక్తృత్వ పోటీల్లో సూరేపల్లి వీవీఎండ్జ్ ఎస్‌ఎం ఉన్నత పాఠశాలకు చెందిన నవ్య ద్వితీయ స్థానం సాధించింది. ఈ మేరకు జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్‌జైన్ చేతుల మీదుగా ప్రత్యేక బహుమతి, రూ.3 వేలు నగదు బహుమతిని సోమవారం అందుకుంది. విద్యార్థినిని పాఠశాల పాలకవర్గ అధ్యక్షుడు వేమూరి చలమయ్య, కార్యదర్శి రావు వెంకటకృష్ణారావు అభినందించారు.


బహుమతి అందుకుంటున్న నవ్య

రాష్ట్ర ఖోఖో జట్టుకు చెరుకుపల్లి బాలిక

చెరుకుపల్లి, న్యూస్‌టుడే: వెంగళాయపాలెం క్రీడా ప్రాంగణంలో ఈనెల 20న జరిగిన రాష్ట్ర స్థాయి అండర్-18 ఖోఖో జట్టు ఎంపిక ప్రక్రియలో చెరుకుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని కె.వాసవి ప్రతిభ చూపి రాష్ట్ర జట్టుకు ఎంపికైంది. ఈనెల 25 నుంచి 27 వరకు చిత్తూరు జిల్లాలో కాణిపాకంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఈమె పాల్గొననుంది. రాష్ట్ర జట్టుకు ఎంపికైన బాలికను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.లక్ష్మీనారాయణ, విద్యా కమిటీ చైర్మన్ పి.శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ జె.కరుణ అభినందించారు.



గుంతల రోడ్లపై ప్రయాణికుల పాట్లు

నగరం, న్యూస్‌టుడే: రేపల్లె-సజ్జావారిపాలెం రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. సజ్జావారిపాలెం కూడలి నుంచి బేతపూడి వరకు అడుగడుగునా గుంతలతో నిండింది. నగరం, నిజాంపట్నం మండలాలకు చెందిన వందల మంది విద్యార్థులు రేపల్లె ప్రైవేటు పాఠశాలల బస్సుల్లో నిత్యం రాకపోకలు నిర్వహిస్తుంటారు. రహదారిని గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం వల్ల రోడ్డు కొన్ని చోట్ల అధ్వానంగా మారింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు బురదమయంగా మారి రోడ్డు మొత్తం ఛిద్రమైంది. ఉన్నతాధికారులు స్పందించి రహదారిని అభివృద్ధి చేయాలని తీరం ప్రజలు కోరుతున్నారు.


రహదారిలో నిలిచిన ట్రాక్టర్, బస్సు



బధిర యువకుడిపై దాడి.. గాయాలు

కావూరు (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: నగదు విషయంలో తలెత్తిన వివాదంలో ముగ్గురు కలిసి ఓ బధిర యువకుడిపై దాడికి పాల్పడిన ఘటన మండలంలో కావూరు వద్ద సోమవారం చోటు చేసుకుంది. చెరుకుపల్లి ఎస్సై అనిల్‌కుమార్ కథనం ప్రకారం కావూరుకు చెందిన దివ్యాంగుడు కె.వెంకటేశ్వరరావు పొలం పనులు చేస్తుంటాడు. ఇతని స్నేహితుడు ముద్దాలపర్రు గ్రామానికి చెందిన సుజన్‌కుమార్ మరో ఇద్దరితో కలిసి వెంకటేశ్వరరావు ఇంటికి వచ్చి అతని ఊరి చివర చెరువు వద్దకు తీసుకెళ్లి కర్రలు, చేతులతో దాడి చేశారు. గమనించిన స్థానికులు అరవడంతో వారు అక్కడి నుంచి పరారయ్యారు. రక్తస్రావమైన బాధితుడిని చికిత్స నిమిత్తం చెరుకుపల్లిలోని ప్రైవేట్ వైద్యశాలకు, అక్కడి నుంచి రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధితుడి తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఆన్‌లైన్ ఆటల్లో పందేలు కాసిన సొమ్ము విషయంలో గొడవలే దీనికి కారణమని స్థానికులు అంటున్నారు.

బహుళ పంటలు.. లాభానికి మార్గాలు

యడ్లపాడు, న్యూస్‌టుడే

ప్రణాళిక ప్రకారం కష్టించి పని చేస్తే వ్యవసాయం దండగ కాదు పండగ అని నిరూపించారు ఆ దంపతులు. ఉద్యాన సాగులో ఆటుపోట్లను అధిగమించి 15 ఏళ్లుగా రాణిస్తున్నారు. యడ్లపాడు మండలం చెంఘీజ్‌ఖాన్‌పేటకు చెందిన చేతరాజుపల్లి శ్రీనివాసరావు, సుబ్బరావమ్మ దంపతులకు సొంత పొలం 3.5 ఎకరాలు ఉంది. దాని పక్కనే ఉన్న మరో ఎకరం కౌలుకు తీసుకున్నారు. ఉద్యాన పంటలకు అనుకూలమైన ఎర్రగడప నేల కావటంతో పూలు, కూరగాయలు సాగు చేస్తున్నారు. పొలంలో బోరు, బిందు సేద్య పరికరాలు ఏర్పాటు చేసుకుని సాగునీరు, ఎరువులు పొదుపుగా వాడుతున్నారు. నిత్యం దంపతులు సాగు పనులు చేస్తున్నారు. అంతర సేద్యం, పురుగు మందులు పిచికారీ, కూరగాయలు, పూలు సొంతంగా కోసుకుంటారు. అవసరమైనపుడే కూలీలను పెట్టుకుంటారు. దిగుబడుల నిల్వకు పొలంలోనే ఓ గది నిర్మించారు. చేను వద్ద అమ్మగా మిగిలిన దిగుబడిని గుంటూరు, చిలకలూరిపేట మార్కెట్‌కు తరలించి విక్రయిస్తున్నారు.


తోటలో బంతిపూలు కోస్తున్న శ్రీనివాసరావు

సాగులో తొమ్మిది అంతర పంటలు

పొలంలో బోరు బావి, బిందు సేద్య పరికరాలను శ్రీనివాసరావు ఏర్పాటు చేసుకున్నారు. వాటి ద్వారా సాగునీరు, ఎరువులు పొదుపుగా వాడుతున్నారు. బొప్పాయి, మునగ, బంతి, చిక్కుళ్లు, టమాటా ప్రధాన పంటలుగా సాగు చేశారు. అందులో అంతర పంటలుగా చామంతి 25 సెంట్లు, కనకాంబరం 25 సెంట్లు, కాకర 35 సెంట్లు, దోస 25 సెంట్లు సాగు చేశారు. ఈ ఏడాది అన్ని రకాల పంటలకు రూ.1.5 లక్షలు ఖర్చు చేశారు. కూరగాయల పంటలు దిగుబడికి సిద్ధంగా ఉన్నాయి. బంతి పూలు నాలుగు నెలలుగా దిగుబడి వస్తోంది. వాటిని చేను వద్దకు వచ్చి కిలో రూ.35 కొంటున్నారు. బంతిసాగుపై పెట్టిన ఖర్చులు పోగా ఇప్పటికి రూ.5 వేలు ఆదాయం వచ్చింది. ఇటీవల కనకాంబరం పూల దిగుబడి ప్రారంభమైంది. ప్రస్తుతం మార్కెట్‌లో కనకాంబరం ధర కిలో రూ.1500 ఉంది. దాని పెట్టుబడి తీరి ఇప్పటికి రూ.10 వేల ఆదాయం వచ్చింది. కార్తిక మాసం కావటంతో ఇదే ధర కొనసాగితే లాభాలు వస్తాయని రైతు ఆశాభావం వ్యక్తం చేశారు.

ఇంతవరకు నష్టం రాలేదు

పూలు, కూరగాయల సాగు ఎంచుకున్నాను. అన్ని రకాల కూరగాయలు, పూలతోటలు సాగు చేస్తున్నా. ఒక్కోసారి కూరగాయలు ధరలు అమాంతం పడిపోతాయి. అన్ని రకాల కూరగాయలు పండిస్తుండటంతో ధర ఉన్న పంటల్లో వచ్చిన ఆదాయంతో నష్టాన్ని భర్తీ చేసుకుంటున్నా. ఏడాదిలో చివరిలో లెక్క చూసుకుంటే ఆదాయమే తప్ప నష్టపోలేదు. అన్ని రకాల పంటలపై ఖర్చులు పోగా ఏడాదికి సుమారుగా రూ.1.5 లక్షల ఆదాయం వస్తుంది.- **శ్రీనివాసరావు, రైతు**

రైతేరాజు

మినుము పంట ఇలా కాపాడుకుందాం

కొల్లూరు, న్యూస్‌టుడే : జిల్లాలో నాలుగైదు రోజులు కుండపోతగా కురిసిన వర్షానికి మినుము పంట పాక్షికంగా దెబ్బతింది. 20 నుంచి 30 రోజుల వయసు కలిగి ఉన్న పంట పలు చోట్ల ఎదుగుదల మందగించి, మొక్కల ఆకులు ఎరుపు, తెలుపు రంగులోకి మారాయి. రైతులకు కొల్లూరు మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు సస్యరక్షణ చర్యలు వివరించారు.



❖ పొలంలో వర్షం నీరు నిలిస్తే వాటిని బయటకు పంపాలి. వర్షాలు తగ్గాక లీటరు నీటిలో ఫెర్రస్ సల్ఫేట్ 5 గ్రాములు, సిట్రిక్ యాసిడ్ 0.5 గ్రాములు, యూరియా 20 గ్రాములు కలిపి ఎకరం పొలంలో పంటపై మొక్కలు పూర్తిగా తడిసేలా పిచికారీ చేయాలి. తద్వారా ఉరకవల్ల మొక్కల పెరుగుదల నిలిచిపోకుండా కాపాడుకోవడంతో పాటు ఇనుప ధాతు లోపాన్ని నివారించుకుని, మొక్కలు తెలుపు రంగులోకి మారకుండా ఉంటాయి. పైరు పెరుగుదలకు ఈ ప్రక్రియ దోహదం చేస్తుంది. ❖ పై మిశ్రమాన్ని పిచికారీ చేసిన వారం తర్వాత 19-19-19 లేదా కేఎన్‌ఓ- 3 (13.0.45) ఒక శాతం మొక్కలపై పిచికారీ చేయాలి. అనంతరం వేరుకుళ్లు, ఆకుమచ్చ తెగులు నివారణకు లీటరు నీటిలో హెక్సాకోనోజోల్- 2 మిల్లీ లీటర్లు, లేదా ప్రొపికోనాజోల్ మిల్లీ లీటరు కలిపి ఎకరం పొలంలో పిచికారీ చేయాలి. ❖ తదుపరి మారుక మచ్చల పురుగు నివారణకు లీటరు నీటిలో క్లోరిపైరిఫాస్ 2.5 మిల్లీ లీటర్లు లేదా నోవాల్యురాన్ 1 మిల్లీ లీటరు కలిపి ఎకరం పొలంలో పిచికారీ చేసుకోవాలి. ఇలా చేస్తే పంటను కాపాడుకోవచ్చు.


జువ్వలపాలెం వద్ద వర్షం నీటితో మినుము చేను

పశువులలో పొదుగు వ్యాధి వ్యాప్తి.. ప్రధాన కారణాలు

వినుకొండ, న్యూస్‌టుడే

పశువుల్లో పొదుగు వ్యాధి ఎక్కువగా వర్షాకాలంలో వ్యాప్తి చెందుతుంది. దీని వల్ల పాల దిగుబడి తగ్గడంతో పాటు నాణ్యత లోపిస్తుంది. సకాలంలో గుర్తించి నివారణ చర్యలు తీసుకుంటే నష్ట నివారణ సాధ్యమేనని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు పి.శ్రీనివాసమూర్తి తెలిపారు. పాల ఉత్పత్తిని ప్రభావితం చేసే ఈ వ్యాధిపై పశు పోషకులకు అవగాహన కోసం ఆయన పలు సూచనలు చేశారు.

❖ తగినంత పరిశుభ్రత, సరైన వైద్యసేవలు లేకపోవడం వ్యాధి రావడానికి ప్రధాన కారణం. అధిక ఉత్పత్తి సామర్థ్యం కలిగిన సంకర జాతి ఆవుల్లో ఎక్కువగా దీన్ని గమనించవచ్చు. పశువు ఈనిన 30- 90 రోజుల వ్యవధిలో వ్యాధి సోకే అవకాశాలున్నాయి. పొదుపు వాపు లక్షణాలను బట్టి రెండు దశలుగా వర్గీకరిస్తారు. క్లీనికల్ దశలో జబ్బును గుర్తించడం సులువు కనుక తక్షణం చికిత్స చేయవచ్చు. సబ్ క్లీనికల్ దశలో లక్షణాలు కనిపించవు కనుక దాన్ని గుర్తించడానికి శాస్త్రీయ పర్యవేక్షణ అవసరం. దీని వల్ల పాల ఉత్పత్తి సుమారు 49శాతం తగ్గుతుంది.

నివారణ చర్యలు : పశువులుండే షెడ్డు, గాలి వెలుతురు సక్రమంగా వచ్చే విధంగా నిర్మించాలి. ఫ్లోరింగ్ ఎల్లప్పుడూ పొడిగా ఉండేలా చూసుకోవాలి. ప్రతి రోజు పరిశుభ్రం చేయాలి. సీఎంటీ, డబ్ల్యూఎస్‌టీ, ఎస్‌ఎఫ్‌ఎంటీ పరీక్షల ద్వారా పొదుపు వాపు గుర్తించవచ్చు.

రైతు ప్రశ్న? శాస్త్రవేత్త సమాధానం

రైతు ప్రశ్న: రబీలో ఎర్ర సెనగ సాగుకు అనువైన వంగడాలతో పాటు ఎండు తెగులు, వేరు తెగుళ్ల నివారణ మార్గాలు ఏమిటి? **-లక్ష్మీనారాయణ, వెనిగండ్ల, పెదకాకాని మండలం**

శాస్త్రవేత్త సమాధానం: ఎన్‌బీఈజీ-776 రకం ఎండు తెగులును తట్టుకుని యంత్ర కోతకు అనువుగా ఉంటుంది. ఎన్‌బీజీ-779, ఎన్‌బీజీ-452 రకాలు ఎండు తెగులును తట్టుకుంటాయి. కిలో సెనగ విత్తనాన్ని 10 గ్రా. ట్రైకోడెర్మా విరిడితో శుద్ధి చేసుకుంటే వేరుకుళ్లను సమర్థంగా అరికట్టవచ్చు. సెనగలో ఎండు తెగులు నివారణకు ఎకరానికి 2 కిలోల ట్రైకోడెర్మా విరిడి పొడిని, 2 కిలోల వేపపిండిని 90 కిలోల పశువుల ఎరువును కలిపి నీడలో కుప్పలా చేసుకుని తగిన తేమ కోసం నీటిని చిలకరించుకుంటూ 20 రోజులకు తెల్లటి బూజు ఏర్పడిన తర్వాత ఆఖరి దుక్కిలో చల్లుకోవాలి. ఎన్‌బీజీ-776, 779, 452 తదితర రకాలను సాగు చేసుకున్నట్లయితే ఎండు తెగులును సాధ్యమైనంత వరకు నివారించవచ్చు.

- డాక్టర్ ఎం.నగేష్, గుంటూరు ఏరువాక కేంద్రం సమన్వయకర్త - న్యూస్‌టుడే, జిల్లాపరిషత్తు(గుంటూరు)

కార్యకర్తలకు అండగా ఉంటా


మాట్లాడుతున్న వైకాపా జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున

బాపట్ల, న్యూస్‌టుడే: 2027లో జమిలి ఎన్నికలు వచ్చే అవకాశం ఉన్నందున పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని వైకాపా జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున అన్నారు. పట్టణంలోని రైలుపేటలో ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో వైకాపా జిల్లా అధ్యక్షుడిగా ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో పార్టీ కార్యకర్తలను అధికార తెదేపా కూటమి అక్రమ కేసులతో వేధిస్తోందని ఆరోపించారు. కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. జగన్‌ను మళ్లీ సీఎం చేయటానికి అందరూ కలిసికట్టుగా కష్టపడి పనిచేద్దామన్నారు. వైకాపా ప్రాంతీయ సమన్వయకర్త కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయకుండా సీఎం చంద్రబాబు ప్రజలను మోసం చేశారని విమర్శించారు. కూటమి ఎమ్మెల్యేలు గ్రామాల్లో తిరిగితే ఎన్నికల హామీలు అమలు చేయలేదని ప్రజలు గట్టిగా ప్రశ్నిస్తారన్నారు. వైకాపా ప్రకాశం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ లోటు బడ్జెట్లోనూ జగన్ నవరత్నాల హామీలు అమలు చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ పోలీసుల ద్వారా వైకాపా శ్రేణులపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆరోపించారు. వైకాపా చీరాల సమన్వయకర్త కరణం వెంకటేష్ మాట్లాడుతూ పింఛన్లు మాత్రమే పెంచి ఇస్తూ ఇతర హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. అందరూ సమైక్యంగా ఉండి పోరాటాలు చేయటం ద్వారా జిల్లాలో వైకాపాను బలోపేతం చేద్దామన్నారు. ఎమ్మెల్సీలు తూమాటి మాధవరావు, లేళ్ల అప్పిరెడ్డి, అధికార ప్రతినిధి శ్రావణి, రేపల్లె, అద్దంకి సమన్వయకర్తలు ఈవూరి గణేష్, పాణెం హనిమిరెడ్డి, బత్తుల బ్రహ్మానందరెడ్డి, గాదె మధుసూదనరెడ్డి తదితరులు ప్రసంగించారు. ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, పర్చూరు సమన్వయకర్త యడం బాలాజీ కార్యక్రమానికి గైర్హాజరయ్యారు.

వేమూరుపై స్పష్టత కావాలి.. వేమూరు నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు మాట్లాడుతూ వేమూరుకు మేరుగ నాగార్జున మళ్లీ వస్తారని కొందరు ప్రచారం చేస్తూ పార్టీలో విభేదాలు సృష్టిస్తున్నారని దీనిపై స్పష్టత ఇవ్వాలన్నారు. గతంలో కార్యకర్తలకు అన్యాయం జరిగిందని, ఈసారి అలా జరగదన్నారు.

నగదు ఆశచూపి బాలికలపై అసభ్య ప్రవర్తన

ప్రశ్నించిన తల్లిదండ్రులపై దాడి

అద్దంకి, న్యూస్‌టుడే : నగదు ఆశచూపి.. బాలికలపై అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఇది చాలదన్నట్లు ప్రశ్నించిన వారి తల్లిదండ్రులపై దాడి చేశాడు. ఈసంఘటన నాలుగు రోజుల క్రితం అద్దంకి పురపాలక సంఘంలో ఓ కాలనీలో చోటు చేసుకుంది. అందిన సమాచారం మేరకు కాలనీలో నివాసముంటున్న బీ ఏడుకొండలును 15 ఏళ్ల క్రితం భార్య వదిలేసింది. ఒంటరిగా ఉంటున్న అతను క్యాటరింగ్ విభాగంలో పని చేస్తున్నాడు. ఏడాది క్రితం అదే కాలనీలో ఉంటున్న ఓ బాలిక(12)కు నగదు ఆశచూపి అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈవిషయాన్ని బాలిక ఎవరికీ చెప్పలేదు. తిరిగి నాలుగు రోజుల క్రితం పాత పద్ధతిలోనే ఆ బాలికకు మళ్లీ నగదు ఆశచూపి దగ్గరకు పిలిచాడు. అసభ్యకరంగా ప్రవర్తించేందుకు ప్రయత్నించగా ప్రతిఘటించింది. హుటాహుటిన ఇంటికి చేరి విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేసింది. ఈ విషయమై ప్రశ్నించేందుకు ఇంటికి వెళ్లిన తల్లిదండ్రులపై ఏడుకొండలు దాడిచేసి గాయపరిచాడు. అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై పోలీసులు మాట్లాడుతూ బాలిక తండ్రి అద్దంకి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడని, కేసు నమోదు చేయనున్నట్లు వెల్లడించారు.

మహిళ ప్రాణం తీసిన వివాహేతర సంబంధం

అనుమానంతో కత్తితో పొడిచిన ప్రియుడు

మార్టూరు, న్యూస్‌టుడే: భర్త నుంచి దూరంగా ఉంటున్న మహిళ ఓ వ్యక్తి పంచన చేరితే అతడు అనుమానంతో కాలయముడై కత్తితో ప్రాణాలు తీసిన ఘటన మార్టూరు మండలం డేగరమూడిలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. సీఐ మద్దినేని శేషగిరిరావు వివరాల మేరకు.. రాజుపాలెం గ్రామం జయంతి నగర్‌కు చెందిన సూరేపల్లి మేరి (27)ని సమీప బంధువు, గొట్టిపాడుకు చెందిన నాగండ్ల నాగేంద్రబాబుతో 9 ఏళ్ల క్రితం వివాహమైంది. మేరి కొంతకాలంగా 7ఏళ్ల కుమారుడు, 4 ఏళ్ల కుమార్తెతో కలిసి భర్తకు దూరంగా ఉంటోంది. రెండేళ్ల క్రితం నెల్లూరు జిల్లా, డీసీపల్లి ప్రాంతంలో పొగాకు పనులకు మేరి వెళ్లగా అక్కడ కొరిశపాడు మండలం ఎర్రబాలేనికి చెందిన కండె ప్రసాద్‌తో పరిచయం ఏర్పడి సన్నిహితంగా ఉంటున్నారు. బిడ్డలతో సహా కండె ప్రసాద్‌తో కలిసి అదే ఊరిలో ఉంటున్నారు. ఈ నేపథ్యంలో డేగరమూడిలో ఉంటున్న మేరి తండ్రి సూరేపల్లి నాగరాజు అనారోగ్యం పాలవడంతో 20 రోజుల క్రితం అక్కడకు వెళ్లింది. మేరిని తన వద్దకు వచ్చేయాలంటూ చరవాణిలో ప్రసాద్ వేధిస్తున్నాడు. ఓ సందర్భంలో అతన్నే వచ్చి డేగరమూడిలో ఉండాలని మేరీ కోరగా మరొకరితో అక్రమ సంబంధం ఏర్పరచుకుందనే అనుమానంతో ఆదివారం వచ్చి ఆమెపై దాడి చేసి, కత్తితో పొడిచాడు. దీంతో తీవ్రంగా గాయపడిన బాధితురాలిని మార్టూరు సీహెచ్‌సీకి అనంతరం మెరుగైన చికిత్స కోసం జీజీహెచ్‌కి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం వేకువజామున మృతి చెందింది. భర్త నాగేంద్రబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

మూడుసవర్ల బంగారు గొలుసు చోరీ

మహిళ బస్సు ఎక్కుతుండగా ఘటన

అద్దంకి, న్యూస్‌టుడే : ఆర్టీసీ బస్సు ఎక్కుతుండగా తన సంచిలోని బంగారు ఆభరణాల పర్సును గుర్తు తెలియని మహిళలు కత్తిరించి బంగారు గొలుసు అపహరించారు. ఈ సంఘటన సోమవారం అద్దంకి ఆర్టీసీ బస్‌స్టాండ్ వద్ద చోటు చేసుకుంది. బాధితురాలు బోడిపాక దయమ్మ అందించిన సమాచారం మేరకు.. నెల్లూరు జిల్లా సూళ్లూరుపేటకు చెందిన దయమ్మ అద్దంకి ఎల్‌ఈఎఫ్ నగర్ వద్ద నివసించే ఆమె అక్క కుమారుడు సువర్ణరాజు ఇంటికి వచ్చింది. రామాటాకీస్ బజారులోని బంగారు దుకాణంలో పాత బంగారం స్థానంలో కొత్తగా రూ.1.50 లక్షల విలువైన మూడు సవర్ల బంగారం గొలుసు తయారు చేయించుకుంది. మధ్యాహ్నం బంగారు గొలుసున్న సంచిని భుజాన వేసుకుని చేతిలోని మరో సంచితో బస్టాండ్‌కు చేరింది. ఒంగోలు బస్సు ఎక్కే క్రమంలో గేటు వద్ద ఇద్దరు అపరిచిత మహిళలు ఆమెను గమనించారు. రద్దీ అధికంగా ఉండటంతో వారిని తప్పుకుంటూ లోపలకు వెళ్లి సీట్లో కూర్చున్న తరువాత సంచి బరువు తగ్గిపోవటంతో అనుమానించి పరిశీలించుకుంది. అప్పటికే బ్లేడుతో సంచిని కోసి అందులోని బంగారు గొలుసు అపహరించుకున్నట్లు గుర్తించింది. లబోదిబో మంటూ కేకలు వేయడంతో ఆర్టీసీ అధికారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాధితురాలిని వెంటపెట్టుకుని ఆర్టీసీ బస్టాండ్ చుట్టూ వాకబు చేశారు. అయినా ఆగంతకుల జాడ దొరకలేదు. దీంతో పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు పోలీసులు వెల్లడించారు.


సంచి చూపుతున్న బాధితురాలు

బ్రాయిలర్ ధరలు (కిలో |కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 133, రిటైల్ ధర - 155, చికెన్ విత్‌స్కిన్ - 225, చికెన్ స్కిన్‌లెస్ - 256.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 140, 149, 160 చికెన్ విత్ స్కిన్ - 268 చికెన్ స్కిన్‌లెస్ - 278.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 530 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

శ్మశానవాటికలో మృతదేహం కలకలం

మార్టూరు, న్యూస్‌టుడే: మార్టూరు శ్మశానవాటిక వద్ద ఓ పెట్టెలో ఉంచిన మృతదేహం కలకలం రేపింది. ఈ ఘటనపై సేకరించిన మేరకు వివరాలు.. సోమవారం ఉదయం కొందరు గ్రామస్థులు మార్టూరు శ్మశాన వాటిక వద్ద పెట్టెలో ఉంచిన మృతదేహాన్ని చూసి ద్రోణాదులకు చెందిన కాళహస్తి రాఘవేంద్రరావు(42)గా గుర్తించారు. అతను కడప జిల్లా రాజంపేటలో ఓ మహిళతో కలిసి జీవనం సాగిస్తూ మృతి చెందాడు. ఆమె అతని చివరి కోరిక మేరకు అంబులెన్సులో మృతదేహాన్ని ఆదివారం రాత్రి ద్రోణాదులకు తీసుకొచ్చింది. అతని తల్లిదండ్రులు మృతదేహాన్ని తీసుకునేందుకు నిరాకరించడంతో వెంట వచ్చిన మహిళ మార్టూరు పోలీసులను ఆశ్రయించింది. వారు ఈ అంశం తమ పరిధిలోనిది కాదనడంతో మృతదేహాన్ని ఫ్రీజర్‌లో ఉంచి మార్టూరు శ్మశానవాటిక వద్ద వదిలి వెళ్లింది. మృతుడు రాఘవేంద్రరావుకు భార్యతో మనస్పర్థలు ఉండటంతో ఆమె నుంచి దూరంగా ఉంటున్నాడని తెలిసింది. కుటుంబ సభ్యుల నుంచి కూడా చాలా కాలంగా దూరంగా ఉండడం, వారితో సత్సంబంధాలు లేకపోవడంతో వారు మృతదేహం స్వాధీనానికి నిరాకరించారని సమాచారం. గ్రామస్థుల జోక్యంతో మృతుడి సోదరుడు నాగార్జున మార్టూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై ఏఎస్సై బాషా మాట్లాడుతూ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామన్నారు. మృతదేహాన్ని శవపరీక్షల అనంతరం అతని సోదరుడికి అప్పగించామని తెలిపారు.

బాపట్ల

• బాపట్ల • రేపల్లె • వేమూరు

23న సామూహిక ఎలుకల నిర్మూలన

చెరుకుపల్లి, అమృతలూరు, న్యూస్‌టుడే: వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఈనెల 23న సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం జరుగుతుందని చెరుకుపల్లి, అమృతలూరు మండల వ్యవసాయాధికారులు టి.బాలాజీ గంగాధర్, లోకేశ్వరి తెలిపారు. సామూహిక నివారణ చర్యలతో మాత్రమే సమర్థంగా ఎలుకల నిర్మూలన సాధ్యమన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు ఆరోజు రైతు సేవా కేంద్రాలు, గ్రామపంచాయతీ వద్ద గ్రామ సభలు నిర్వహించి ఎలుకల నిర్మూలనకు ఉపయోగించే బ్రోమోడయోలిన్ మందును రైతులకు ఉచితంగా అందించి వాడే విధానం తెలియజేస్తారన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఎలుకల బెడద నుంచి విముక్తి పొందాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

బాపట్ల : 80085 73141, రేపల్లె : 80085 73135, వేమూరు: 91107 837382

? మండలంలోని పెరవలిపాలెంలో సచివాలయం ఎదురు బజారులో కల్వర్టు వద్ద పల్లంగా ఉండడం వల్ల నీరు నిలుస్తోంది. దీంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. చాలా కాలం నుంచి పరిస్థితి ఇలా ఉన్నా పట్టించుకున్న నాథుల్లేరు. **- స్థానికుడు, పెరవలిపాలెం**

✔ పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపడతా. **- శేఖర్, ఈవోపీఆర్‌డీ.**

– న్యూస్‌టుడే, వేమూరు

? భట్టిప్రోలు మార్కెట్ వెనుక జెండా చెట్టు వద్ద మురుగు నీరు రహదారిపై నిల్వ ఉంది. దీంతో దోమల ఉద్ధృతి పెరిగి అనారోగ్యం పాలవుతామని భయపడుతున్నాం.

- జఫ్రుల్లా, భట్టిప్రోలు

✔ పారిశుద్ధ్య సిబ్బందితో మాట్లాడి మురుగు రోడ్డుపై నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటాం. **- శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి, భట్టిప్రోలు.** – న్యూస్‌టుడే, భట్టిప్రోలు

? అడవుదీవి - రేపల్లె ఆర్‌అండ్‌బీ రహదారి మార్గంలో రోడ్డుకు ఇరువైపులా ముళ్ల మొక్కలు పెరిగాయి. వాహనాలు ఎదురుగా వస్తే తిప్పలు తప్పడం లేదు. పెరిగిన ముళ్ల మొక్కలు తొలగించి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడాలి. **- స్థానికుడు అడవులదీవి**

✔ క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి రహదారుల నిర్వహణ పనులు చేయించే సమయంలో ముళ్ల మొక్కలు తొలగిస్తాం. ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూస్తాం.


- విద్యాసాగర్, ఏఈ, ఆర్‌అండ్‌బీ. – న్యూస్‌టుడే, నిజాంపట్నం

పొంచి ఉన్న ప్రమాదం

★ అలంకరణ దీపాల నిర్వహణపై నిర్లక్ష్యం

★ ఊడిపోయిన ఎంసీబీలు

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే





గుంటూరు పై వంతెనపై ఐటీబీల విద్యుత్తు దీపాల నుంచి వెలువడిన మంట, పొగ, వేలాడుతున్న ఎంసీబీలు

జిల్లా కేంద్రం బాపట్లలో కొన్నిచోట్ల విద్యుత్తు స్తంభాలకు ఏర్పాటు చేసిన అలంకరణ దీపాల రూపంలో ప్రమాదం పొంచి ఉందా? అనే సందేహాలు కలుగుతున్నాయి. పట్టణంలో ప్రధాన కూడలి మొదలుకొని వార్డుల్లో సైతం కొన్ని స్తంభాల వద్ద విద్యుత్తు కనెక్షన్లు ఎక్కడికక్కడ వేలాడుతూ దర్శనమిస్తున్నాయి. ప్రధానంగా గత వైకాపా ప్రభుత్వ పాలనలో అధికారులు పాలకుల మెప్పు కోసం గడియారస్తంభం నుంచి ఏజీ కళాశాల వరకు మీదుగా సూర్యలంక రోడ్డు వైపు, భావన్నారాయణస్వామి రోడ్డు, జీబీసీ రోడ్డులోని పాత బస్టాండ్ ప్రాంతం, గుంటూరు వైవంతెనపై రంగురంగుల దీపాలను అలంకరణగా ఏర్పాటు చేశారు. రూ.లక్షల ప్రజాధనం వెచ్చించి ఎంతో ఆర్భాటంగా ఏర్పాటు చేసిన దీపాలు కొన్ని ప్రాంతాల్లో వెలుగుతుండగా మరికొన్ని ప్రాంతాల్లో పెద్ద ప్రమాదభరితంగా మారి ప్రజల ప్రాణాలకే ముప్పు తెచ్చేలా ఉన్నాయి. నాసిరకంగా పనులు చేయడంతో ఏజీ కళాశాల రోడ్డులో విభాజకాలపై ఉన్న విద్యుత్తు స్తంభాలకు అమర్చిన రంగురంగుల దీపాలకు సంబంధించి విద్యుత్తు ఎంసీబీలు బాక్సుల నుంచి బయటకు రావటం, మరో వైపు వర్షాలు పడుతుండటంతో షార్ట్‌సర్క్యూట్ సంభవిస్తే ప్రాణ నష్టం వాటిల్లే ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఇటీవల గుంటూరు పై వంతెనపై అర్ధరాత్రి సమయంలో విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్ సంభవించి ఓ స్తంభంపై విద్యుత్తు దీపం నుంచి మంటలు చెలరేగి పొగలు వ్యాపించటంతో ఆ మార్గంలో ప్రయాణించే వారు ఏం జరుగుతుందో తెలియక భయాందోళనకు గురయ్యారు. కొన్ని ప్రాంతాల్లో ఈ దీపాలకు సంబంధించి ఏర్పాటు చేసిన విద్యుత్తు తీగలు స్తంభాలకు తక్కువ ఎత్తులో నెలకొల్పటంతో ఏ సమయంలో ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు భయంగుప్పిట గడుపుతున్నారు. అధికారులు స్పందించి విద్యుత్తు కనెక్షన్ల వద్ద మరమ్మతులు చేయటంతో పాటు ప్రమాదభరితంగా వేలాడుతున్న ఎంసీబీలను సరిచేయాలని, ప్రమాదాలు సంభవించకుండా చర్యలు చేపట్టాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

పంట కోత ప్రయోగంపై శిక్షణ

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: పంటకోత ప్రయోగం నివేదిక పక్కాగా తయారు చేసేలా అందరూ దృష్టిసారించాలని వ్యవసాయశాఖ రేపల్లె సహాయ సంచాలకురాలు ఆర్.విజయబాబు అన్నారు. రేపల్లె పట్టణ రైతు సేవా కేంద్రంలో పంట కోత ప్రయోగంపై శిక్షణ తరగతులు నిర్వహించి సోమవారం మాట్లాడారు. పంటకోత ప్రయోగం చేసే ప్రక్రియ, సర్వే, రాండమ్ నంబర్లు పొందుపర్చాల్సిన పద్ధతులను వివరించారు. ఎకరం పంటలో సరాసరి దిగుబడి అంచనా, నివేదిక తయారు చేసే విధానాలపై అవగాహన కల్పించారు. ఏవో నాగశ్రీనివాసరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

రైతుబజార్ ప్రారంభం నేడు

బాపట్ల, న్యూస్‌టుడే: పట్టణంలో రైతుబజార్‌ను ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ చేతుల మీదుగా మంగళవారం ప్రారంభించను న్నారు. 2019లో తెదేపా ప్రభుత్వ హయాంలో రూ.60 లక్షల వ్యయంతో ఎన్టీఆర్ పురపాలక కూరగాయల మార్కెట్ వద్ద రైతుబజారును నిర్మించారు. ఆయితే వైకాపా పాలనలో రైతుబజారును ప్రారంభించకుండా నిరుపయోగంగా ఉంచారు. రైతుబజారు అందుబాటులో లేకపోవటం, రైతులు రోడ్డు పక్కన కూరగాయలు, ఆకుకూరలు విక్రయిస్తున్న వైనంపై 'ఈనాడు' లో పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ ఏడాది జులైలో ప్రచురితమైన కథనానికి ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, కలెక్టర్ వెంకట మురళి స్పందించారు. రైతుబజారు ప్రారంభించటానికి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. రైతుబజారులో దుకాణాల ఏర్పాటుకు మార్కెటింగ్ శాఖ ఏడీకి 21 దరఖాస్తులు వచ్చాయి. రైతులు, పొదుపు సంఘాల మహిళల నుంచి ఇంకా ఎవరైనా దరఖాస్తు చేసినా దుకాణాలు కేటాయించటానికి అధికారులు సిద్ధంగా ఉన్నారు. రైతులు తమ పంట ఉత్పత్తులను నేరుగా విక్రయించుకునేలా రైతుబజారును ప్రారంభించటానికి సిద్ధం చేశారు. జేసీ ప్రఖర్‌జైన్‌తో కలిసి ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రైతుబజారును ప్రారంభించనున్నారు. ఏర్పాట్లను మార్కెటింగ్ శాఖ ఏడీ రమేష్‌బాబు, పురపాలక కమిషనర్ రఘునాథరెడ్డి సోమవారం పర్యవేక్షించారు.



ఏర్పాట్లపై సిబ్బందికి సూచనలిస్తున్న మార్కెటింగ్ శాఖ ఏడీ రమేష్‌బాబు, పురపాలక కమిషనర్ రఘునాథరెడ్డి

హడలెత్తిస్తున్న వానరాలు



విజయలక్ష్మీపురంలో కోతుల సంచారం

బాపట్ల, న్యూస్‌టుడే: పట్టణ పరిధిలో వానరాల స్వైరవిహారంతో పలు కాలనీల వాసులు హడలిపోతున్నారు. కొన్నిచోట్ల యథేచ్ఛగా ఇళ్లలోకి వచ్చి వస్తువులు, సామాన్లను పాడు చేయటమే కాక అడ్డుకుంటున్న వారిపై దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. పట్టణంలోని విజయలక్ష్మీపురం, త్యాగరాయనగర్, బెస్తపాలెం, మార్కెట్‌బజారు, రైల్వేస్టేషన్ రోడ్డు, నరాలెట్టివారిపాలెం, ఇస్లాంపేటలో కోతుల బెడద ఎక్కువగా ఉంది. ఇంటి పెరట్లో కూరగాయలు, పూల మొక్కలు, పండ్ల చెట్లను వానర సైన్యం ధ్వంసం చేస్తున్నాయి. ఆరుబయట ఆరేసిన దుస్తులను చించేస్తున్నాయి. ఇటీవల కూరగాయలు విక్రయిస్తున్న మహిళపై కోతులు దాడి చేసి గాయపరిచాయి. ఇంటి నుంచి బయటకు రావటానికి, రోడ్లపై రాకపోకలు సాగించటానికి కాలనీవాసులు భయపడుతున్నారు. దీనిపై పురపాలక కమిషనర్ రఘునాథరెడ్డిని ప్రశ్నించగా కోతులను పట్టించి పట్టణానికి దూరంగా వదిలిపెడతామన్నారు.

దళిత ఉద్యోగుల అభ్యున్నతికి కృషి



ఎంపీ కృష్ణప్రసాద్‌ను సత్కరించిన దళిత ఉద్యోగుల సంఘం నేతలు

బాపట్ల, న్యూస్‌టుడే: దళిత ఉద్యోగుల అభ్యున్నతికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ అన్నారు. కేంద్ర హోం వ్యవహారాల పార్లమెంటు కమిటీ సభ్యుడిగా నియమితులైన సందర్భంగా పట్టణంలోని ఎంపీ కార్యాలయంలో కృష్ణప్రసాద్‌ను దళిత ఉద్యోగుల సంఘం నేతలు సోమవారం కలిసి సత్కరించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానన్నారు. నేతలు ఎం.దేవపాల్, పి.శేషగిరిరావు, జె.వినయ్‌కుమార్, రాజకిరణ్, సురేష్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో అదుర్స్

ఈనాడు ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు

బాపట్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని బాపట్ల పబ్లిక్ స్కూల్, లిటిల్ ఏంజెల్స్ పాఠశాలల్లో 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు సోమవారం నిర్వహించారు. పోటీల్లో భాగంగా 'ఇంటర్నెట్ వల్ల లాభ నష్టాలు- విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు జరిగాయి. బాపట్ల పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన పోటీల్లో రాణించిన సీహెచ్ భవ్య సాయి భార్గవ్ (పదో తరగతి) ప్రథమ, జి.నిఖిల్ సాయి (ఎనిమిదో తరగతి) ద్వితీయ, బి.సుదీప్ (తొమ్మిదో తరగతి) తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలకు పాఠశాల ప్రిన్సిపల్ వీవీస్ రఘురామ్, ఉపాధ్యాయులు పి.రామకృష్ణ, వి.ఆశాలత బహుమతులు ప్రదానం చేశారు. లిటిల్ ఏంజెల్స్ పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపి ఎస్‌కే షీనా కౌసర్ (తొమ్మిదో తరగతి) ప్రథమ, జి.బాల శివ నందిని (పదో తరగతి) ద్వితీయ, వై.భాను భరద్వాజ (పదో తరగతి) తృతీయస్థానం సాధించారు. విజేతలకు పాఠశాల ఎండీ జి.అభినవ్, ప్రిన్సిపల్ వి.సెబాస్టియన్, ఉపాధ్యాయులు కాలప్రియ, శివప్రసాద్ బహుమతులు అందజేశారు.



బాపట్ల పబ్లిక్ స్కూల్‌లో బహుమతులు అందుకున్న విద్యార్థులు భవ్యసాయి భార్గవి, నిఖిల్ సాయి, సుదీప్



లిటిల్ ఏంజెల్స్ పాఠశాలలో బహుమతులు అందుకున్న విద్యార్థులు షీమా కౌసర్, బాల శివనందిని, భాను భరద్వాజ

డ్రోన్ సాయంతో గుర్రపుడెక్క తొలగిస్తాం

ఆరుంబాక (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: డ్రెయిన్‌లో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తామని ఓల్డ్‌కోర్సు డ్రెయిన్ ఏఈ కల్యాణ్‌బాబు తెలిపారు. మండలంలో ఆరుంబాక పంచాయతీ పరిధిలోని ఓల్డ్‌కోర్సు డ్రెయిన్‌లో పేరుకున్న గుర్రపు డెక్కను ఆయన సోమవారం పరిశీలించారు. గుర్రపు డెక్క తొలగించేందుకు రసాయనాలు పిచికారీ చేయిస్తామన్నారు. ఇప్పటికే పనుల అప్పగింత ప్రక్రియ పూర్తయిందన్నారు. ఆయన వెంట రైతులు ఈవూరి దుర్గాప్రసాద్, రామారావు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి రెవెన్యూ గ్రామ సభలు

రేపల్లె అర్బన్, నగరం, అమృతలూరు, కొల్లూరు, చెరుకుపల్లి, న్యూస్‌టుడే: గతంలో భూముల రీసర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని ఆయా మండలాల తహసీల్దార్లు ఎం.శ్రీనివాసరావు, నాంచారయ్య, నెహ్రూబాబు, వెంకటేశ్వర్లు, సీహెచ్ పద్మావతి సూచించారు. గ్రామ సభలు నిర్వహించి అభ్యంతరాలు పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెవెన్యూ అధికారులు నిర్దేశిత గ్రామాల్లో అందుబాటులో ఉంటారన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయా మండలాల్లో సభలు సాగే తేదీలివే.. ★ రేపల్లె మండలం కారుమూరులో 22న, 24న పరిశపాడు, 26న అరవపల్లి ★ నగరం మండలంలో 22న నగరం సచివాలయం, 24న పమిడిమర్రు, 26న పూడివాడ, 29న పెద్దవరం ★ అమృతలూరు మండలంలో 23న యలవర్రు, 24న బోడపాడు ★ కొల్లూరు మండలం 23న బొద్దులూరుపాడు, 25న దోనేపూడి ★ 23న చెరుకుపల్లి మండలం పొన్నపల్లి.

భళా.. బాలిక



అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా జిల్లాలో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు కలెక్టరేట్లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో జేసీ ప్రఖర్ జైన్ బహుమతులు అందించి అభినందించారు. డీఆర్వో సత్తిబాబు, డీఎంహెచ్‌వో విజయమ్మ, ఆర్డీవో గ్లోరియా తదితరులు పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, బాపట్ల**

నిర్దేశిత సమయంలో నిర్మాణం పూర్తి చేయాలి



లబ్ధిదారుకు మంజూరు పత్రం ఇస్తున్న తెదేపా నేత శివప్రసాద్

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: నిర్దేశిత సమయంలో మినీ గోకులాల నిర్మాణం పూర్తి చేసేలా పశుపోషకులు కృషి చేయాలని పశు సంవర్ధక శాఖ రేపల్లె సహాయ సంచాలకుడు బెల్లంకొండ నాంచారయ్య సూచించారు. గోకులాల నిర్మాణంపై రేపల్లె వ్యవసాయ మార్కెట్ యార్డులో అవగాహన సదస్సు నిర్వహించి సోమవారం మాట్లాడారు. రేపల్లె, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాల్లో 152 మినీ గోకులాల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. రెండు, నాలుగు, ఆరు పశువుల షెడ్ల నిర్మాణానికి రూ.1.15, రూ.1.85, రూ.2.30 లక్షల చొప్పున 90 శాతం రాయితీపై ఉపాధి హామీ పథకం నిధులు మంజూరు చేసిందన్నారు. పశుపోషకులు 10 శాతం నగదు జమ చేస్తే 90 శాతం నగదు ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. గోకులాల షెడ్లు మంజూరైన లబ్ధిదారులు సకాలంలో నిర్మించుకుంటే మరికొంత మంది పశు పోషకులకు అవకాశం కలుగుతుందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెదేపా నేత అనగాని శివప్రసాద్ లబ్ధిదారులకు షెడ్ల మంజూరు పత్రం అందజేశారు. నాయకులు తాతా ఏడుకొండలు, పశువైద్యులు ప్రవీణ్‌కుమార్, హేమప్రియ, కరీముల్లా, రోషన్‌బేగ్, జోత్స్న, ఏపీవో సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులు చైతన్యవంతులు కావాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, న్యూస్‌టుడే: తెదేపా కార్యకర్తలు ఆయా గ్రామాల్లో ఉన్న పట్టభద్ర ఓటర్లను గుర్తించి, వారిని చైతన్య పరచి ఉమ్మడి కృష్ణా, గుంటూరు ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపునకు కృషి చేయాలని ఎమ్మెల్యే ఆనందబాబు పిలుపునిచ్చారు. వేమూరులోని శ్రీ లక్ష్మీ పద్మావతి కల్యాణ మండపంలో నియోజకవర్గ తెదేపా కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెదేపా నేతృత్వంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నారని చెప్పారు. దీపావళికి అర్హులకు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందజేస్తామన్నారు. గడచిన వైకాపా పాలనలో రాష్ట్రం అస్తవ్యస్తంగా మారిందని విమర్శించారు.

సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి.. తెదేపా సభ్యత్వ నమోదును మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు వేగవంతం చేయాలని కోరారు. సభ్యత్వం తీసుకున్న వారికి రెండేళ్ల పాటు రూ. 5లక్షల బీమా వర్తిస్తుందని తెలిపారు. ప్రతి పది మందిలో నలుగురు సభ్యులు ఉండేలా చూడాలన్నారు. పార్టీ పదవులు కోరుకునే వారు కనీసం 50మందిని సభ్యులుగా చేర్చాలని సూచించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు జె.విజయబాబు, డి.సుబ్బారావు, ఎం.మురళీకృష్ణ, ఎ.మధుసూదనప్రసాద్, వీఎస్‌కే ప్రసాద్, టి.శివారెడ్డి, కె.వెంకటరెడ్డి, టి.సాయిబాబా, వాకా శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా సీఎం సహాయనిధి



చెక్కు ఇస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

బాపట్ల, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతున్న పేద, మధ్యతరగతి వర్గాలు కార్పొరేట్ వైద్యం పొందటానికి సీఎం సహాయ నిధి ద్వారా సాయం చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు అండగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. పిట్టలవానిపాలెం మండలం మంతెనవారిపాలెనికి చెందిన మంతెన లక్ష్మి ప్రసన్నకు వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి రూ.8 లక్షల మంజూరు పత్రాన్ని స్థానిక తెదేపా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అందజేశారు. కర్లపాలెం మండలం యాజలికి చెందిన తాండ్ర సాయి శ్రీరామకృష్ణకు రూ.2.42 లక్షలు, పేరలి గ్రామానికి చెందిన యనుకుల మురళీకృష్ణారెడ్డికి రూ.1.75 లక్షలు, తూర్పు బాపట్లకు చెందిన జంపని శివప్రసాద్‌కు రూ.40 వేలు, నల్లమోతువారిపాలెం గ్రామ నివాసి రూ.37 వేలు, బాపట్ల పట్టణం వివేకానందకాలనీవాసి దుడ్డు రమేష్‌కు రూ.20 వేలు చొప్పున మొత్తం రూ.13,14,645 చెక్కులను వేగేశన పంపిణీ చేశారు.

26 నుంచి రాష్ట్రస్థాయి యోగాసన పోటీలు

బాపట్ల, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 26 నుంచి 28వరకు 37వ రాష్ట్రస్థాయి యోగాసన ఛాంపియన్‌షిప్ పోటీలు నంద్యాలలో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కళ్లం హరినాథ్ రెడ్డి, అల్లాడి రవికుమార్ తెలిపారు. స్థానిక చీలురోడ్డు వద్ద గల ఎకో హౌస్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నంద్యాల జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ సహకారంతో జరిగే ఈ పోటీల్లో 8ఏళ్ల నుంచి 60ఏళ్ల లోపు వారు వివిధ విభాగాల్లో పాల్గొనవచ్చని చెప్పారు. ఇక్కడ సత్తాచాటిన వారు ఏడాది త్రిపురలో జరిగే జాతీయస్థాయి యోగాసన ఛాంపియన్ షిప్‌లో పాల్గొంటారన్నారు. సమావేశంలో డాక్టర్ శరత్‌బోస్, సిద్ధార్థ మహారాజ్, కత్తి శ్రీనివాసరావు, కేశవులు, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

చేబ్రోలు, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన ఘటన ఇది. ఎస్సై వెంకట కృష్ణ కథనం ప్రకారం... బాపట్ల జిల్లా చెరుకుపల్లికి చెందిన మద్దెల రోశయ్య (30) మూడు రోజులుగా వడ్లమూడిలోని తన అక్క నాగలక్ష్మి దగ్గర ఉంటూ చిన్నా అనే వ్యక్తికి చెందిన ఇనుప దుకాణంలోకి పనికి వెళ్తున్నాడు. సోమవారం ఉదయం దుకాణంలో విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయాడు. స్థానికులు తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లక్ష్యం దిశగా పరుగు

పరుగు, ఖోఖోలో రాణిస్తున్న ఖాజీపాలెం విద్యార్థులు

ఖాజీపాలెం (పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే

సాధనతో అనుకున్నది సాధిస్తూ, పట్టుదలతో లక్ష్యాన్ని చేరుతూ పల్లె విద్యార్థులు క్రీడలపై పట్టు సాధిస్తున్నారు. ఆరో తరగతిలో చేరిన నాటి నుంచి చదువుతో పాటు క్రీడల్లో పతకాలు సాధిస్తున్నారు. మండలంలోని ఖాజీపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు అథ్లెటిక్స్, ఖో-ఖోలో రాణించి పాఠశాల పేరు ఇనుమడింపజేస్తున్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, పీడీ శిక్షణతో మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలుగా నిలుస్తున్నారు.



ఆటలంటే మక్కువతో..



ఖాజీపాలెం పంచాయతీ పరిధిలోని కప్పలవారిపాలెం గ్రామానికి చెందిన బ్రహ్మేశ్వరి తొమ్మిదో తరగతి చదువుతుంది. ఈ విద్యార్థినికి క్రీడలంటే ఎంతో మక్కువ కావడంతో తల్లిదండ్రులు ప్రోత్సహిస్తున్నారు. చదువులోనూ రాణిస్తోంది. మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో అథ్లెటిక్స్‌లో 800 మీటర్లు, 3కె పరుగు పందెం, ఖో-ఖోలో ప్రతిభ చూపి పతకాలు సాధించింది. రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించి నెల్లూరు జిల్లా ఆత్మకూరులో జరిగిన పరుగు పోటీలో ప్రతిభ కనబర్చి ద్వితీయ స్థానం సాధించింది. మైదానంలో దిగితే గమ్యం చేరటమే ఆమె లక్ష్యంగా ఉంటుంది.

జాతీయ స్థాయి క్రీడాకారుడిగా ఎదగాలని..



ఖాజీపాలెం పంచాయతీ కప్పలవారిపాలెం గ్రామానికి చెందిన డి.శివా గణేష్‌రెడ్డి పదోతరగతి చదువుతున్నాడు. అతడు చిన్నప్పటి నుంచి ఖో-ఖో, పరుగు పందెంలో మెలకువలు నేర్చుకున్నాడు. పీడీ కరీముల్లా సూచనలతో మండల, జోనల్, జిల్లా స్థాయిలో పోటీల్లో ప్రతిభ కనపర్చి అండర్-17 విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. భవిష్యత్తులో జాతీయ స్థాయి క్రీడాకారుడిగా ఎదగాలనేదే అతని లక్ష్యంగా పేర్కొన్నాడు.

నిత్య సాధనతో..



ఖాజీపాలెం గ్రామానికి చెందిన వాసంతి ఏడో తరగతి చదువుతోంది. అథ్లెటిక్స్‌లో నిత్య సాధన చేసి సత్తా చాటింది. అండర్-14 విభాగంలో అథ్లెటిక్స్, ఖో-ఖోలో మండల, జోనల్, జిల్లా స్థాయి పోటీల్లో సత్తా చాటుతుంది. సీనియర్ క్రీడాకారులను ఆదర్శంగా తీసుకుని రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావటమే తన లక్ష్యమని తెలిపింది.

నిత్యావసర ధరలు తగ్గించరూ!

రేపల్లె అర్బన్, చెరుకుపల్లి: రేపల్లె రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆరు అర్జీలు వచ్చినట్లు ఆర్డీవో రామలక్ష్మి తెలిపారు. వేమూరు మండలం జంపనిలో కుమ్మరి కుంటలో ఆక్రమణలు తొలగించాలని, భట్టిప్రోలు మండలం గొరికపూడిలో స్థలం ఆక్రమించి ఇంటి నిర్మాణం చేశారని, పెదలంకలో శ్మశాన వాటికను సర్వే చేయించాలని, వెల్లటూరులో తమ భూమి సర్వే చేయించాలని, రేపల్లె మండలం ఉప్పూడిలో ఇళ్ల స్థలాలకు సర్వే చేయించి దారి చూపాలని, నిత్యావసర ధరలు తగ్గించే చర్యలు తీసుకోవాలని పట్టణ ఆదర్శ వేదిక ఆధ్వర్యంలో వినతులు అందజేశారు. చెరుకుపల్లి తహసీల్దార్ కార్యాలయంలో రెండు అర్జీలు అందాయి. చెరుకుపల్లికి చెందిన రైతు అడంగల్‌లో తప్పుగా నమోదైన తనపేరు సరిచేయాలని, మరోరైతు తన వ్యవసాయ భూమిని సర్వే చేయించాలని దరఖాస్తు చేసినట్లు తహసీల్దార్ పద్మావతి తెలిపారు. ఎంపీడీవో మహబూబ్ సుబానీ, డీటీ శాంతిలక్ష్మి పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి



బాపట్ల: నివాళులర్పిస్తున్న మెరైన్ పోలీసులు

బాపట్ల పట్టణం, నిజాంపట్నం, న్యూస్‌టుడే : విధి నిర్వహణలో భద్రతా దళాల ప్రాణ త్యాగాన్ని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని మెరైన్ సీఐ లక్ష్మారెడ్డి చెప్పారు. పోలీసు అమరవీరుల స్మారక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మండల పరిధిలోని సూర్యలంక సముద్రతీరం వెంట కవాతు నిర్వహించి నివాళులర్పించారు. పలువురు పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు. నిజాంపట్నంలో అమరవీరుల చిత్రపటాలకు ఎస్సై తిరుపతిరావు నేతృత్వంలో సిబ్బంది పూలమాల వేసి నివాళి అర్పించారు.

నిబంధనల పేరుతో కాలయాపన తగదు



నిరసన తెలుపుతున్న కౌలు రైతులు

కొల్లూరు, న్యూస్‌టుడే: కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వకుండా తప్పించుకునేందుకు స్టేట్ బ్యాంకు కొల్లూరు శాఖ అధికారులు నిబంధనల పేరుతో కాలయాపన చేసి చివరకు మొండి చేయి చూపడం దారుణమని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తోడేటి సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. కౌలు రైతులకు రుణాల మంజూరు విషయంలో స్థానిక స్టేట్‌బ్యాంకు శాఖ అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ సోమవారం ఆ బ్యాంకు ఎదుట నిరసన తెలిపిన కౌలు రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కౌలు రైతు చట్టం 2019 ప్రకారం గుర్తింపు కార్డులు పొందిన కౌలు రైతులకు బ్యాంకులు విధిగా పంట రుణాలు ఇవ్వాల్సి ఉందని వివరించారు. తొలకరి ప్రారంభం నుంచి కౌలు రైతులు స్థానిక స్టేట్ బ్యాంకు చుట్టూ రుణాల కోసం తిరుగుతున్నా ఇప్పటి వరకు తాత్సారం చేసిన బ్యాంకు అధికారులు ఖరీఫ్ తరుణం ముగిసే సమయానికి పొంతన లేని నిబంధనలు చెబుతూ రుణాల మంజూరు కుదరదని చెప్పడం శోచనీయన్నారు. ఈ ఏడు సంభవించిన వరదలు, భారీ వర్షాలు వంటి ప్రకృతి వైపరీత్యాలతో రైతులు అల్లాడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడంపై నిరసనకు దిగినట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో కౌలురైతు సంఘం నాయకులు మునిపల్లి కోటేశ్వరరావు కౌలు రైతులు కాకాని బాబు, పులివర్తి సురేష్, కిషోర్ పాల్గొన్నారు.

తెదేపా నాయకుల చొరవతో వీధిదీపాల ఏర్పాటు

నిజాంపట్నం: మండలంలోని కూచినపూడి పంచాయతీలో వీధి దీపాలు సక్రమంగా వెలగక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానిక తెదేపా నాయకుడు ఇమ్మిడిశెట్టి శ్రీనివాసరావు, యువత ఎల్ఈడీ బల్బులు తెప్పించి ఏర్పాటు చేయించారు. లైట్లు ఏర్పాటు చేసిన తెదేపా నాయకులను గ్రామ తెదేపా అధ్యక్షుడు ఎల్లారయ్య సోమవారం ప్రత్యేకంగా అభినందించారు.

చీరాల

• చీరాల • అద్దంకి • పర్చూరు

వేటపాలెంలో విద్యుత్తు అధికారుల దాడులు

వేటపాలెం: విద్యుత్తు శాఖ ఈఈ కె.జాన్ థామస్ ఆధ్వర్యంలో విద్యుత్తు అధికారులు 36 బృందాలుగా విడిపోయి వేటపాలెంలో సోమవారం దాడులు చేసి 3119 సర్వీసులను తనిఖీ చేశారు. అధికలోడు వాడే 76 సర్వీసుల నుంచి రూ. 3,76,200లు అపరాధ రుసుం వసూలు చేశారు. చీరాల, వేటపాలెం, పర్చూరు డీఈఈలు బి.హరిప్రసాద్, జె.శ్రీనివాసులు, రమేష్ డీపీఈ డీఈఈ మల్లికార్జునరావు, ఏఈలు ఉదయభాస్కర్, అరుణ కుమారి, మనోహరబాబు, సిబ్బంది ఉన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న విద్యుత్తు అధికారులు

క్రమశిక్షణకు ఎన్‌సీసీ దోహదం

వేటపాలెం: క్రమ శిక్షణకు ఎన్‌సీసీ దోహదపడుతుందని పందిళ్లపల్లి జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.శేఖరరావు పేర్కొన్నారు. ఎన్‌సీసీ క్యాడెట్లకు 'ఏ' ధ్రువీకరణ పత్రాల ప్రదానోత్సవ సందర్భంగా సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 36 మందికి ధ్రువీకరణ పత్రాలను ఎన్‌సీసీ 29(ఏ) బెటాలియన్ చీరాల కమాండింగ్ అధికారి సునీల్ గౌతమ్ ప్రధానోపాధ్యాయుడికి అందజేయగా ఆయన వాటిని క్యాడెట్స్‌కు పంపిణీ చేశారు.



ధ్రువపత్రాలు పొందిన విద్యార్థులతో కమాండింగ్ అధికారి సునీల్ గౌతమ్, ఉపాధ్యాయులు

రూ.6 లక్షలతో పోలీసు ఔట్‌పోస్టు

రోటరీ క్లబ్ ఆఫ్ ఇంకొల్లు సెంట్రల్ సహకారంతో ఇంకొల్లు స్వాగత కూడలిలో పోలీసు ఔట్‌పోస్టు నిర్మాణం పూర్తయింది. ముప్పవరం, 16వ నంబరు జాతీయ రహదారి, పర్చూరు, కడవకుదురు, ఒంగోలు వెళ్లే మార్గాలకు కూడలిలో ఔట్‌పోస్టు నిర్మించారు. రోటరీ అవయవ నేత్రదాన సలహా కేంద్ర ప్రతినిధి సోమేపల్లి రామమోహనరావు, రోటరీ మాజీ అధ్యక్షుడు వత్సవాయి నారాయణ రాజు సమకూర్చిన రూ.6 లక్షల వ్యయంతో ఔట్ పోస్టు నిర్మించారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ఈ నిర్మాణం వల్ల ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం లభించనుంది. ఇంకొలులో రక్షణ నిలయంతోపాటు సీఐ కార్యాలయం ఉంది. త్వరలో శాసన సభ్యుడు ఏలూరి సాంబశివరావు ఔట్‌పోస్టును ప్రారంభించనున్నారని రోటరీ క్లబ్ అధ్యక్షుడు మహమ్మద్‌రఫి తెలిపారు.

– న్యూస్‌టుడే, ఇంకొల్లు



గుంతల రహదారులతో ఇబ్బందులు

గత పాలకుల నిర్లక్ష్యంతో ఇంకొల్లులోని ప్రధాన రహదారులకు గ్రహణం పట్టింది. ఇంకొల్లు.. ఐదు మండలాల పరిధిలోని 40 గ్రామాలకు కూడలి. పాతచెన్నై రహదారితో పాటు ముప్పవరం, చీరాల, మార్టూరు, కడవకుదురు ప్రాంతాలకు ఆర్‌అండ్‌బీ రహదారులు అనుసంధానమై ఉన్నాయి. వర్షా కాలంలో కనీస మరమ్మతులు లేనందున రహదారులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ముఖ్యంగా ఇంకొల్లు పంచాయతీ పరిధిలో పాతచెన్నై రహదారి మార్కెట్ యార్డు నుంచి ఆఫీసర్స్ క్లబ్ వరకు గుంతలు పడి రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. పేరుకు సీసీ రోడ్డు అయినప్పటికి సినిమాహాళ్ల కూడలి, అభయాంజనేయస్వామి ఆలయం సమీపంలో సీసీ, బీటీ రోడ్డు అనుసంధానమయ్యే చోట గుంతలేర్పడ్డాయి. గ్రామంలో అంతర్గతరోడ్లు అనుసంధానమయ్యే చోట ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.



నీటి మడుగులా తయారైన పాతచెన్నై రహదారి

కడవకుదురు రోడ్డు, బస్‌స్టేషన్ సమీపంలో ముస్లిం నివాస ప్రాంతాల్లో రహదారుల్లోని నీరు గృహాల్లోకి ప్రవేశిస్తోంది. పంచాయతీ, ఆర్‌అండ్‌బీ సంయుక్తంగా రహదారులకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, ఇంకొల్లు

నీటి సరఫరా వద్దే అపరిశుభ్రత

ఇంకొల్లు రక్షిత చెరువు దగ్గర నీటి సరఫరా చేసే ఓవర్‌హెడ్ ట్యాంకు వద్ద అపరిశుభ్రత నెలకొంది. చెరువుపై రెండు ఓవర్ హెడ్ ట్యాంకులు ఉన్నాయి. ఇటీవల తూర్పువైపు ట్యాంకు దగ్గర శుభ్రం చేసి గ్రావెల్ పరిచారు. అప్పటి వరకు అక్కడ గ్రామస్థులు గేదెలు కట్టి, పశువుల పాకలా చేశారు. దక్షిణం వైపు కట్టపై ఉన్న ట్యాంకు కింద భాగంలో చిల్లచెట్లు, పిచ్చి మొక్కలు పెరిగాయి. విష పురుగులు తిరుగాడుతున్నాయి. చెరువు చుట్టూ ఇటీవల పొక్లెయిన్‌తో శుభ్రం చేసినా ట్యాంకు దగ్గర చేయలేదు. ట్యాంకు పరిసరాలు, పంపు హౌస్ దగ్గర పేరుకుపోయిన వ్యర్థాలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, ఇంకొల్లు



మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

చీరాల అర్బన్: 9849165189 అద్దంకి: 9440915704
పర్చూరు: 8008574106

? ఏల్చూరు శివారు గ్రామం రామిరెడ్డిపాలెంలోని ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలోని చేతి పంపు గత రెండేళ్లుగా మరమ్మతులకు నోచుకోక మూలన పడింది.

- విద్యార్థుల తల్లిదండ్రులు, రామిరెడ్డిపాలెం

✔ పరిశీలించి మరమ్మతులు చేయించి వినియోగంలోకి తెస్తాం. **- శివరామప్రసాద్, ఈవోఆర్డీ, సంతమాగులూరు**

- న్యూస్‌టుడే, ఏల్చూరు, (సంతమాగులూరు)

? దేవాంగపురి పంచాయతీ ఆధ్వర్యంలో సరఫరా అవుతున్న మంచినీరు శుభ్రంగా ఉండటం లేదు. తరచు పురుగులు వస్తున్నాయి. **- కోటి నాగేశ్వరరావు, స్థానికుడు**

✔ వెంటనే సిబ్బందితో వెళ్లి ట్యాంకు పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టి మంచినీరు పరిశుభ్రంగా వచ్చేలా చూస్తాం.

- ఎం.శ్రీనివాసరావు, కార్యదర్శి - న్యూస్‌టుడే, చీరాల గ్రామీణం

? విఠల్ నగర్‌లోని బోనుమిల్లు ప్రాంతంలో చెత్తతొలగించకపోవటంతో ఇబ్బంది పడుతున్నాం. **- ఇశ్రాయేలు**

✔ వెంటనే సిబ్బందిని పంపి చెత్తతొలగిస్తాం

- ప్రవీణ్, పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్ -న్యూస్‌టుడే, చీరాల

? పాతచెన్నై రహదారిలో ఇరువైపులా మురుగు కాలువలు లేక గృహాల్లో మురుగునీరు రహదారిపై నిలిచి రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది.

- జానకి రామారావు, స్థానికుడు ఇంకొల్లు

✔ ఆర్‌అండ్‌బీ అధికారులతో సంప్రదించి సర్వే అనంతరం కాలువలు నిర్మించేలా కృషి చేస్తాం

- వెంకట సుబ్బారెడ్డి కార్యదర్శి, ఇంకొల్లు పంచాయతీ
- న్యూస్‌టుడే, ఇంకొల్లు

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

అద్దంకి: బల్లికురవ మండలం జమ్మలమడుగు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి భూ సంబంధిత విషయమై సోమవారం ఆత్మహత్యకు యత్నించాడు. వైకాపాకు చెందిన ఇతను సాగు చేసుకుంటున్న భూమిని తెదేపా వర్గీయులు ఆక్రమిస్తున్నారని పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు.

విద్యార్థులకు గొడుగుల పంపిణీ

పర్చూరు(మార్టూరు), న్యూస్‌టుడే: మండలంలోని కొమర్నేనివారిపాలెంలో సోమవారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గొడుగులను పంపిణీ చేశారు. పర్చూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 60 మందికి రూ.200 చొప్పున రూ.12 వేల విలువైన గొడుగులను దాత నాగభైరు శ్రీనివాసరావు అందజేశారు.

● విద్యార్థులు పౌష్టిక ఆహారం తీసుకుని సంపూర్ణ ఆరోగ్యం పొందాలని హెచ్ఎం టి.బెంజిమెన్‌హానోక్ కోరారు. మండలంలోని చెరుకూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో అల్యూమినీ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మజ్జిగ పంపిణీ చేశారు.

రీ-సర్వే పూర్తైన గ్రామాల్లో సమస్యలపై సదస్సులు

యద్దనపూడి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం రీ-సర్వే పూర్తైన గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ఈనెల 23 నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. 23న గన్నవరం, 24న వింజనంపాడు, 25న జాగర్లమూడి, 26న యద్దనపూడి పంచాయతీ కార్యాలయాల వద్ద రెవెన్యూ అధికారులతో సమావేశాలు నిర్వహిస్తారని, సమస్యలను అధికారులకు వినతులు అందించాలని తహసీల్దార్ కోరారు.

చినగంజాం, న్యూస్‌టుడే: గతంలో రీ- సర్వే గొనసపూడి, చింతగుంపల, కడవకుదురు గ్రామాల్లోని భూములకు సంబంధించి బుధవారం నుంచి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జె.ప్రభాకరరావు తెలిపారు. ఈ నెల 23న గొనసపూడిలో, 24న చింతగుంపల, 25న కడవకుదురుల్లో గ్రామసభలు జరుగుతాయని తెలిపారు.

హుండీల చోరీలు.. ప్రజల బెంబేలు

మార్టూరు, న్యూస్‌టుడే

హిందూ ఆలయాలే లక్ష్యంగా చోరీలు పెరగడంతో గ్రామీణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గుర్తుతెలియని వ్యక్తులు అర్ధరాత్రి ఆలయాల తలుపులు పగులగొట్టి హుండీలను యథేచ్ఛగా పెకలిస్తున్నారు. ఇటీవల కారంచేడు, పర్చూరు ప్రాంతాల్లోని ఆలయాల్లో జరిగిన హుండీ చోరీలే ఇందుకు నిదర్శనం. నెల రోజుల్లో మూడు సంఘటనలతో భక్తులు బెంబేలెత్తుతున్నారు. వాడరేవు- పిడుగురాళ్ల జాతీయ రహదారి వెంటున్న కారంచేడు ఆంజనేయస్వామి ఆలయంలో ఈనెల ఆరంభంలో హుండీ పగులగొట్టి నగదు దోచుకెళ్లారు. వెనువెంటనే పర్చూరు మండలం బోడవాడ రామాలయంలో ఈనెల 11న హుండీ పెకలించుకెళ్లి, తాళాలు పగులగొట్టి అందులో నగదును తీసుకెళ్లారు. అంతకు ముందు నాలుగైదు రోజుల క్రితం అదే గ్రామంలోని పోలేరమ్మ గుడిలోనూ దొంగలు హుండీ పగులగొట్టిన విషయాన్ని భక్తులు గుర్తుచేస్తున్నారు. అన్నంబొట్లవారిపాలెంలోనూ హుండీ పగులగొట్టిన సంఘటనలు ఉన్నాయి.



కొద్దిరోజుల క్రితం బోడవాడ ఆలయంలో దొంగలు పెకలించిన హుండీ

ఇళ్లను వదలని చోరులు

దేవాలయాలనే కాక ఇళ్లను దొంగలు వదలడంలేదు. ఈఏడాది జూన్‌లో అన్నంబొట్లవారిపాలేనికి చెందిన జానకీ దేవి ఇంట్లో విలువైన బంగారం, వెండి దోచుకెళ్లారు. తిమ్మరాజుపాలెంలోని బాబు, నాగేంద్రం ఇళ్లలో చోరీ జరిగింది. వీరన్నపాలెంలో అమెరికా వెళ్లినవారి ఇంట్లో రూ.3.50 లక్షల విలువైన సొత్తు అపహరించారు. మార్టూరు మండలం వలపర్లలో 22.6.24న తాళాలు వేసిన ఇళ్లనే లక్ష్యంగా చేసుకుని దొంగలు చోరీకి పాల్పడ్డారు.

దొంగలను పట్టుకుంటాం

ఇటీవల ఆలయాల్లోని హుండీ చోరీలు జరిగిన విషయం మాదృష్టికి వచ్చింది. త్వరలోనే దొంగలను పట్టుకుంటాం. ప్రజలు ఇళ్లకు తాళాలు వేసి వేరే గ్రామాల వెళ్లేటప్పుడు పోలీసులకు సమాచారం ఇస్తే చోరీలు జరగకుండా ప్రత్యేక శ్రద్ధ చూపుతాం. ఇలాంటి విషయాల్లో ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలి.

– జీఎల్.శ్రీనివాసరావు, సీఐ, మార్టూరు రూరల్

గుర్తింపు కార్డులతో బహుళ ప్రయోజనాలు

అద్దంకి, న్యూస్‌టుడే : ఆటో చోదకులకు కల్పించిన గుర్తింపు కార్డుల ద్వారా బహుళ ప్రయోజనాలు ఉంటాయని ఎస్సైలు ఖాదర్‌భాషా, ప్రవీణ అన్నారు. శింగరకొండరోడ్డు లోని లారీ కాటా వద్ద శ్రీప్రసన్నాజంనేయ నేస్తమా ఆటో యూనియన్ ఆధ్వర్యంలో గుర్తింపు కార్డులు అందించారు. ఎమ్మార్పీయస్ నేత పూనూరి నరేంద్ర మాట్లాడుతూ రాత్రి సమయాల్లో ప్రయాణించే ఆటో చోదకులకు గుర్తింపు కార్డులు మరింతగా ఉపకరిస్తాయని ఆయన తెలిపారు.

కుండీ వద్ద చెత్త తొలగింపు

మార్టూరు, న్యూస్‌టుడే: జాతీయ రహదారి సేవామార్గం వద్ద ఏర్పాటు చేసిన కుండీలో పేరుకుపోయిన చెత్తాచెదారం ఎట్టకేలకు తొలగించారు. మార్టూరులోని ప్రధాన అండర్‌పాస్ సమీపంలో పంచాయతీ నేతృత్వంలో స్థానికులు ఇళ్లలోని చెత్త పోసేందుకు వీలుగా కుండీని ఏర్పాటు చేశారు. అయితే అందులో చెత్తాచెదారం పేరుకుపోవడంతో ఈనాడు దిమినీలో కథనం ప్రచురితమైంది. దీంతో సోమవారం పంచాయతీ అధికారులు కార్మికులతో మెరుగైన పరిశుభ్రం కల్పించే త్వరితగతిన చర్యలు చేపట్టడంతో స్థానికులు అభినందనలు వ్యక్తం చేస్తున్నారు.

ఈనాడు కథనానికి స్పందన

ప్రజలకు నిజమైన స్నేహితులు పోలీసులే

బల్లికురవ(అద్దంకి): ప్రజలకు నిజమైన స్నేహితులు పోలీసులేనని ఎస్ఐ జీవీ.చౌదరి అన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా బల్లికురవ పంచాయతీ పరిధిలోని నాలుగు వీధుల్లో ప్రదర్శన చేశారు. పోలీసులు రాత్రింబవళ్లు కష్టపడి పని చేసి నందున ప్రజలు ప్రశాంతంగా నిద్ర పోగలుగుతున్నారన్నారని పేర్కొన్నారు. విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందించనున్నట్లు ఆయన వెల్లడించారు.

సంతమాగులూరు, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రం సంతమాగులూరులో ప్రదర్శన నిర్వహించారు. పోలీసు అమర వీరుల త్యాగాలను పోలీసు అధికారులు స్మరించుకున్నారు. కార్యక్రమంలో సీఐ వెంకట్రావు, ఎస్సై ఎం.పట్టాభిరామయ్య, సిబ్బంది, ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



సంతమాగులూరులో ప్రదర్శన నిర్వహిస్తున్న సీఐ వెంకట్రావు

ఎంపీ ఆదేశాల మేరకు చేనేత శిక్షణ కేంద్రాల పరిశీలన

చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే: బాపట్ల ఎంపీ కృష్ణ ప్రసాద్ ఆదేశాల మేరకు విజయవాడ వీవర్స్ సర్వీస్ సెంటర్ అధికారులు సోమవారం చీరాల మండలం ఈపూరుపాలెంలోని చేనేత శిక్షణ కేంద్రాలను (సీఎఫ్‌సీ) పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వీస్ సెంటర్ డీడీ సాహు, ఏడీహెచ్ కె.నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ.. చీరాల ప్రాంతంలో చేనేతల ఆదాయ వనరులను పెంచే లక్ష్యంతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఇందుకోసం త్వరలో ఈపూరుపాలెం కేంద్రంగా చేనేతలకు జా కార్డు మగ్గాలపై విలువైన జందానీ చీరల తయారీపై 45 రోజుల శిక్షణను అందించనున్నట్లు తెలిపారు. శిక్షణ తీసుకునే వారికి రోజుకు రూ.300 భృత్యం కూడా అందిస్తామన్నారు. ఎంపీ కార్యాలయ ప్రతినిధి సురేష్, డీవో వెంకటేశ్వర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



చేనేత శిక్షణ కేంద్రాలను పరిశీలిస్తున్న విజయవాడ వీవర్స్ సర్వీస్ సెంటర్ అధికారులు, జిల్లా చేనేత అధికారులు

ప్రజావ్యతిరేక నిర్ణయాలు వెనక్కు తీసుకోవాలి

అద్దంకి, న్యూస్‌టుడే : బీమా రంగంలో పాలసీదారులకు, ఏజెంట్లకు నష్టం చేకూరుస్తూ యాజమాన్యం తీసుకున్న నిర్ణయాలను వెంటనే వెనక్కు తీసుకోవాలని జీవితబీమా ఏజెంట్ల సంఘం ప్రతినిధులు అన్నారు. స్థానిక జీవితబీమా కార్యాలయం వద్ద సోమవారం నిరసన చేపట్టారు. కనీస బీమా రూ.1 నుంచి రూ.రెండు లక్షలకు పెంచడంపై సాధారణ కుటుంబాలు బీమా సదుపాయాన్ని కోల్పోతున్నాయన్నారు. యాజమాన్యం తీసుకున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో రెండు వర్గాల వారు నష్టపోతున్నట్లు చెప్పారు. పాతవిధానాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు.

శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

చిన్నకొత్తపల్లి(అద్దంకి), న్యూస్‌టుడే : నామ్ రహదారిపై బాపట్ల జిల్లా అద్దంకి మండలం చిన్నకొత్తపల్లి సమీపంలో నిర్మించనున్న శ్రీ భూ సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్ సతీమణి ఝాన్సీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బాచిన చెంచుగరటయ్య ప్రత్యేక పూజలు చేశారు. శంకుస్థాపన అనంతరం తిరుపతికి చెందిన ఋత్విక్ సత్యనారాయణ బృందం ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం కనులపండువగా నిర్వహించారు. గ్రామానికి చెందిన శ్రీయాన్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.25 కోట్ల అంచనా వ్యయంతో ఈ ఆలయం నిర్మించనున్నారు. రెండేళ్ల కాలపరిమితిలో ఆలయ నిర్మాణం పూర్తి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు నిర్వాహకులు దేవినేని శ్రీకాంత్, తేలప్రోలు సుబ్బారావు, నూతి రామకృష్ణ వెల్లడించారు.



ఆలయం యాగశాల వద్ద పూజలు చేస్తున్న మంత్రి గొట్టిపాటి సతీమణి ఝాన్సీ

చదువుతో పాటు క్రీడలు ముఖ్యమే

వేటపాలెం, న్యూస్‌టుడే: చదువుతో పాటు క్రీడలు ముఖ్యమేనని, వీటి వల్ల శారీక దారుఢ్యంతో పాటు మానసిక వికాసం కలుగుతోందని ఒంగోలు ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం కళాశాల ప్రధానాచార్యుడు డాక్టరు రాజమోహన్ అన్నారు. క్రీడల్లో నైపుణ్యం ప్రదర్శించే వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ ఉంటోందన్నారు. బండ్ల బాపయ్య హిందూ డిగ్రీ కళాశాలలో యూనివర్సిటీ బాల్ బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక కోసం సోమవారం కొత్తపేట రావిసుబ్బారాయుడు ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఎంపికలను ఆయన ప్రారంభించారు. కళాశాల ప్రధానాచార్యురాలు జి.ఆదిలక్ష్మి మాట్లాడుతూ ఇక్కడ ఎంపికైన విద్యార్థులు త్వరలో చెన్నై ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో జరిగే సౌత్‌జోన్ పోటీలకు యూనివర్సిటీ తరపున పంపడం జరుగుతోందన్నారు. ఎంపికకు విశ్వవిద్యాలయం పరిధిలోని 32 కళాశాలల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. వీరికి పోటీలు నిర్వహించగా అత్యంత ప్రతిభ కనబరిచిన ఎనిమిది మంది క్రీడాకారులను యూనివర్సిటీ జట్టుకి ఎంపిక చేశారు.

నిలిచిన ఆర్టీసీ బస్సు.. ప్రయాణికుల అవస్థలు

పర్చూరు, కారంచేడు (మార్టూరు), న్యూస్‌టుడే: ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానానికి చేర్చాల్సిన ఆర్టీసీ బస్సు మార్గమధ్యంలో మరమ్మతులకు గురికావడంతో అందులోని ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సోమవారం చీరాల నుంచి నరసారావుపేటకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు టైరు పంక్చరు కావడంతో కారంచేడు- పర్చూరు జాతీయ రహదారిపై నిలిచిపోయింది. తెల్లవారుజాము సమయంలో నిలిచిపోయిన బస్సు టైరు మార్చుకునే వీలులేకపోవడంతో బస్సు కండెక్టర్ అందులో ప్రయాణిస్తున్న వారిని మరో బస్సులోకి ఎక్కించి పంపారు. దీంతో ప్రత్యామ్నాయంగా మరో బస్సు వచ్చే వరకు పదుల సంఖ్యలో ఉన్న తాము రోడ్డుపైనే తీవ్ర అవస్థలు పడ్డామని ఓ ప్రయాణికుడు వాపోయాడు.



నిలిచిపోయిన బస్సు వద్ద రోడ్డుపై వేచిచూస్తున్న ప్రయాణికులు

రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

కొరిశపాడు(మేదరమెట్ల), న్యూస్‌టుడే : కొరిశపాడు ఫైవంతెన వద్ద జరిగిన ప్రమాదంలో ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం నందిపాడుకు చెందిన ఎస్.సాయికృష్ణకు గాయాలయ్యాయి. జాతీయ సంచార వాహన సిబ్బంది అందించిన సమాచారం మేరకు ప్రకాశం జిల్లా పొన్నలూరు మండలం తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన షేక్ భాషా, షేక్ చిన్న భాషాలు ద్విచక్రవాహనంపై వ్యతిరేక దిశలో మేదరమెట్ల వైపు నుంచి చిలకలూరిపేట వైపు వెళుతున్నాడు. ఇదే సమయంలో ఎదురుగా వస్తున్న సాయికృష్ణను వీరి ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో కిందపడి గాయపడ్డాడు. సాయికృష్ణ కాలికి తీవ్రగాయాలు కావటంతో 108 వాహనంలో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

గిరిజనులకు ఉచిత సేవలు

అద్దంకి, జే.పంగులూరు: ఆదివాసీ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులకు ఉచిత సేవలు అందిస్తుందని అద్దంకి, జే.పంగులూరు తహసీల్దారులు జీ.శ్రీచరణ్, పోపూరి సింగరావు తెలిపారు. ఆ మేరకు వారి ఛాంబర్‌లో రెవెన్యూ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అద్దంకి మండల పరిధిలో 80 మందిని గిరిజనులను గుర్తించి వారికి పుట్టిన తేదీ ధృవపత్రాలు, ఆధార్ కార్డులు అందిస్తున్నామన్నారు. అద్దంకి పట్టణంలోని 8, 10 సచివాలయాల్లో ఆధార్ సేవలు కొనసాగుతున్నట్లు వెల్లడించారు.

నేడు డయల్ యువర్ డీఎం

చీరాల, న్యూస్‌టుడే : చీరాల ఆర్టీసీ డిపో పరిధిలోని సమస్యలు తెలుసుకొనేందుకు మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎం జె.శ్యామల తెలిపారు. ఉదయం 11గంటల నుంచి 12 మధ్యలో 99592 25696 నంబర్‌కు ఫోన్ చేసి ప్రయాణికులు సమస్యలతో పాటు సలహాలు, సూచనలు ఇవ్వాలని తెలిపారు.

పోలేరమ్మ అమ్మవారి ఉత్సవ విగ్రహం ఊరేగింపు

అద్దంకి, న్యూస్‌టుడే : దసరా శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం రాత్రి అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ఊరేగింపు నిర్వహించారు. ఇందిరానగర్‌లోని ఆలయం నుంచి ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై అమ్మవారిని ఉంచారు. భక్తులు పెద్దఎత్తున హాజరయ్యారు.

వైభవంగా గోవింద నామ గళార్చన

చీరాల: రోహిణి నక్షత్రాన్ని పురస్కరించుకొని పాపరాజుతోటలోని రాధాకృష్ణ మందిరంలో గోవింద నామగళార్చన, ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

కారంచేడు(మార్టూరు), న్యూస్‌టుడే: మండలం లోడాదిపూడిలో సోమవారం పలు అభివృద్ధి పనులకు అధికారులు భూమిపూజ చేశారు. పల్లె పండుగలో భాగంగా సీసీరోడ్లు, మురుగు కాల్వల నిర్మాణాలకు ప్రభుత్వం కేటాయించిన నిధులతో పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

విద్యార్థినికి నగదు బహుమతి అందజేత

చందలూరు(జే.పంగులూరు), న్యూస్‌టుడే: అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన 'సేవ్ ది గర్ల్ ఛైల్డ్' వక్తృత్వ పోటీల్లో చందలూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని చల్లా గాయత్రి ప్రథమస్థానంలో నిలిచింది. ఆ మేరకు సోమవారం బాపట్ల జిల్లా కార్యాలయం వద్ద జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో విద్యార్థినికి రూ.ఐదు వేల నగదు, ప్రశంసాపత్రాన్ని అందించారు.

అవీ ఇవీ

వలపర్లలో చేతుల పరిశుభ్రత కార్యక్రమం

మార్టూరు, న్యూస్‌టుడే: బాలలు చేతులు శుభ్రంగా ఉంచుకోవడంతో మెరుగైన ఆరోగ్యాన్ని పొందుతారని డీబీఎస్ఐ (డెటాల్ బనేగా స్వస్థ ఇండియా) ప్రతినిధులు ఎన్.పొన్నుస్వామి, ఏఎస్.కుమారి తెలిపారు. మండలంలోని వలపర్లలో సోమవారం చేతుల పరిశుభ్రత దినోత్సవాన్ని నిర్వహించారు.

కూరగాయల మార్కెట్ తనిఖీ

మార్టూరు, న్యూస్‌టుడే: మార్టూరు కూరగాయల మార్కెట్‌ను మార్కెటింగ్ శాఖ అధికారుల బృందం సోమవారం పరిశీలించింది. జాతీయంగా పేరుగాంచిన మార్టూరు కూరగాయల మార్కెట్‌లో రైతులు తీసుకొస్తున్న పచ్చి సరకు ధరలు, మార్కెటింగ్ విధానం వంటి అంశాలను పరిశీలించారు.. పర్యటించిన వారిలో ఒంగోలు మార్కెటింగ్ డీడీ సువర్చల, చీరాల ఏఎంసీ కార్యదర్శి ప్రసాద్ ఉన్నారు.

దాతల సహకారం అభినందనీయం

సజ్జాపురం (సంతమాగులూరు): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని పర్చూరు ఉప విద్యాశాఖాధికారి ఏ.శ్రీనివాసరావు అన్నారు. సజ్జాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థి ఎన్నారై గోరంట్ల శేషగిరి తన తల్లిదండ్రులు శేషమ్మ వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం సొంత నిధులతో రెండు అదనపు తరగతి గదులను నిర్మించారు. వీటిని డిప్యూటీ డీఈవో శ్రీనివాసరావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దాతలకు ఆయన అభినందనలు తెలిపారు.



అదనపు తరగతి గదులను ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఈవో శ్రీనివాసరావు

పండ్ల మొక్కలు పెంచాలి

కొరిశపాడు(మేదరమెట్ల): పండ్ల మొక్కల్లోనే పోషకాహారం లభిస్తుందని కొరిశపాడు సీడీపీవో డి.కృష్ణకుమారి అన్నారు. కొరిశపాడులోని సెక్టార్ కార్యాలయం వద్ద దానిమ్మ, జామ, బత్తాయి వంటి పండ్లతో పాటు ఆకుకూరల మొక్కల్ని నాటారు.

స్కేటింగ్ పోటీల్లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

అద్దంకి, న్యూస్‌టుడే : ఉమ్మడి ప్రకాశం జిల్లా రోలర్ స్పోర్ట్స్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించి స్కేటింగ్ పోటీల్లో అద్దంకి శ్రీచైతన్య విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. విద్యార్థులు కే.సహస్ర(1వ తరగతి), రోడ్డుస్కేటింగ్‌లో బంగారు పతకం, రింక్ స్కేటింగ్‌లో రజత పతకాన్ని గెలుచుకుంది. దేసు చాణక్య రింక్ స్కేటింగ్‌లో బంగారు పతకం, కె.శాన్వి రింక్ 1, 2 భాగాల్లో బంగారు పతకాన్ని, రోడ్డు స్కేటింగ్‌లో రజత పతకాన్ని గెలుచుకున్నారు. ఐదో తరగతికి చదువుతున్న దర్శిని నాగసాహితి రోడ్డు స్కేటింగ్‌లో మొదటి బహుమతిగా బంగారు పతకం, రింక్ స్కేటింగ్‌లో రజిత పతకాన్ని దక్కించుకుంది. వి.దీక్షిత రింక్ స్కేటింగ్‌లో రెండోభాగంలో రజిత పతకం గెలుచుకున్నారు.

శ్రీనివాసరావు కుటుంబానికి పరామర్శ

చీరాల అర్బన్: ఇటీవల పాపాయిపాలేనికి చెందిన పులి శ్రీనివాసరావు అలియాస్ బాతుల శ్రీను అనుమానస్పదంగా మృతిచెందిన విషయం తెలిసిందే. ఆ కుటుంబాన్ని వైకాపా ఇన్‌ఛార్జీ కరణం వెంకటేష్ సోమవారం పరామర్శించారు.

ఘనంగా అద్దంకమ్మవారి కొలుపులు

చీరాల గ్రామీణం: చీరాల మండలం పాత చీరాల గ్రామంలో సోమవారం అద్దంకమ్మ వారి కొలుపులు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక అతిథులుగా డీఎస్పీ జగదీష్ నాయక్, గ్రామ నాయకులు, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వారు పాల్గొన్నారు.

వినాయకుడి విగ్రహ ప్రతిష్ఠ

పర్చూరు(మార్టూరు), న్యూస్‌టుడే: మండలంలోని దేవరపల్లెలో జమ్మిచెట్టు సమీపంలో నిర్మించిన గుడిలో విఘ్నేశ్వరుడి విగ్రహ ప్రతిష్ఠ వైభవోపేతంగా నిర్వహించారు. వేద పండితుల హోమాది పూజలు అనంతరం స్వామివారిని దాత రావి రంగనాథబాబు దంపతులు ప్రతిష్ఠా కార్యక్రమంలో పాల్గొని ప్రతిష్ఠాపూజలు నిర్వహించారు.